रजिस्ट्री सं. डी–२२१
**Registered No. D-221**
రిజిస్ట్రీ సంఖ్య. డి–221

मूल्य रू. १५–००
**Price Rs. 15-00**
మూల్యము : రూ. 15–00

# भारत का राजपत्र
# The Gazette of India
## భారత రాజపత్రము

**असाधारण**
**EXTRAORDINARY**
అసాధారణ
**भाग XVI अनुभाग 1**
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1
**प्राधिकार से प्रकाशित**
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १. | नई दिल्ली | गुरुवार | ७ नवंबर, २०२४ | अश्वयुजा | खंण्ड ३१ |
| **No.1** | **New Delhi** | **Thursday** | **7 November, 2024** | **Ashwayuja** | **Vol. 31** |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | గురువారము | 7 నవంబరు, 2024 | ఆశ్వయుజ | సంపుటము 31 |

MINISTRY OF LAW AND JUSTICE
(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 11th October, 2024

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Telecom Regulatory Authority of India Act, 1997 [Act No.24 of 1997], (2) The National Investigation Agnecy Act, 2008 [Act No.34 of 2008], (3) The Rights of Persons with Disabilities Act, 2016 [Act No.49 of 2016], (4) The Indian Institutes of Management Act, 2017 [Act No.33 of 2017] are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

**శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ**

**(శాసన నిర్మాణ విభాగము)**

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) భారత టెలికాం క్రమబద్ధీకరణ ప్రాధికార సంస్థ చట్టము, 1997 (1997లోని 24వ చట్టము), (2) జాతీయ దర్యాప్తు ఏజెన్సీ చట్టము, 2008 (2008లోని 34వ చట్టము), (3) దివ్యాంగుల హక్కుల చట్టము, 2016 (2016లోని 49వ చట్టము), (4) భారతీయ సంస్థల నిర్వహణ చట్టము, 2017 (2017లోని 33వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# దివ్యాంగుల హక్కుల చట్టము, 2016
## (2016లోని 49వ చట్టము)

**(27, డిసెంబరు, 2016)**

**ఐక్యరాజ్య సమితి సమావేశములో దివ్యాంగుల హక్కులపై ప్రభావమును కలిగించుటకు మరియు అందుకు సంబంధించిన లేదా ఆనుషంగికమైన విషయములను నిబంధించుటకైన చట్టము.**

2006, డిసెంబరు 13వ తేదీన దివ్యాంగుల హక్కులపై ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ తన సమావేశము ఆమోదించినందుననూ;

మరియు దివ్యాంగుల సాధికారత కొరకు ఈ క్రింది సూత్రములను పై సదరు సమావేశము నిబంధిస్తున్నందుననూ,-

(ఎ) తన సొంత ఎంపికలు చేసుకొను స్వాతంత్ర్యముతో పాటు స్వాభావిక మాన్యత, వ్యక్తిగత స్వతంత్ర ప్రతిపత్తి మరియు వ్యక్తుల యొక్క స్వాతంత్ర్యమును గౌరవించుట;

(బి) విచక్షణా రహిత;

(సి) సమాజములో పూర్తిగా మరియు సమర్థవంతముగా పాల్గొనుట;

(డి) దివ్యాంగులలో వ్యత్యాసమును గౌరవించి మరియు మానవ వైవిధ్యము మరియు మానవీయతగల వ్యక్తులను అనుమతించుట;

(ఇ) సమాన అవకాశములు;

(ఎఫ్) చనువుగా వ్యవహరించుట;

(జి) స్త్రీ, పురుషుల మధ్య సమానత్వము;

(హెచ్) దివ్యాంగ బాల బాలికల స్తోమతలను మరియు వారి యొక్క గుర్తింపులను పరిరక్షించుడానికైన హక్కును గౌరవించుట;

మరియు సదరు సమావేశమునందు భారతదేశము కూడా సంతకము చేసినందుననూ;

మరియు 2007, అక్టోబరు మొదటి దినమున సదరు సమావేశమును గతకాలిక ప్రభావముతో ఆమోదించినందుననూ;

మరియు పైన పేర్కొనబడిన సదరు సమావేశ అంశములను అమలుపరచవలసిన అవసరము ఉన్నందుననూ;

భారత గణరాజ్యపు అరవై ఏడవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

## అధ్యాయము - I

## ప్రారంభిక

సంగ్రహనామము మరియు ప్రారంభము.

1. (1) ఈ చట్టమును దివ్యాంగుల హక్కుల చట్టము, 2016 అని పేర్కొనవచ్చును.

(2) ఇది, కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి [1]తేదీన అమలులోనికి రావలెను.

నిర్వచనములు.

2. ఈ చట్టములో సందర్భము ఇతర విధముగా కోరిననే తప్ప,-

(ఎ) "అపిలేటు ప్రాధికారి" అనగా 14వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) లేదా 53వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అధిసూచించబడిన లేదా సందర్భానుసారము 59వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నియుక్తుడైన ప్రాధికారి అని అర్థము;

(బి) "సముచిత ప్రభుత్వము" అనగా,-

(i) కేంద్ర ప్రభుత్వమునకు సంబంధించి లేదా కంటోన్మెంటుల చట్టము, 2006 (2006లోని 41వది) క్రింద ఏర్పాటు చేయబడిన కంటోన్మెంటు బోర్డు లేదా ఆ ప్రభుత్వముచే పూర్తిగా లేదా తగినంతగా ఆర్థిక సహాయము సమకూర్చబడిన ఏదేని సంస్థకు సంబంధించి కేంద్ర ప్రభుత్వము;

(ii) రాజ్య ప్రభుత్వమునకు సంబంధించి లేదా ఆ ప్రభుత్వముచే పూర్తిగా లేదా తగినంత ఆర్థిక సహాయము చేయబడిన ఏదేని సంస్థ లేదా కంటోన్మెంటు బోర్డు కాని ఏదేని స్థానిక ప్రాధికార సంస్థకు సంబంధించి రాజ్య ప్రభుత్వము.

(సి) "అవరోధము" అనగా సమాచారపరమైన, సాంస్కృతిక, ఆర్థిక, పర్యావరణ, సంస్థాగతమైన, రాజకీయ, సామాజిక, వైఖరితో సహా ఏదేని అంశము లేదా సమాజములో దివ్యాంగుల ప్రవేశమునకు పూర్తిగా మరియు సమర్థవంతముగా అవరోధమును కలిగించు నిర్మాణాత్మక అంశములు అని అర్థము;

(డి) "సంరక్షకుడు" అనగా దివ్యాంగులకు, తల్లిదండ్రులు మరియు ఇతర కుటుంబ సభ్యులతో పాటు చెల్లింపుతో లేదా చెల్లింపు లేకుండా భద్రత, ఆసరా లేదా సహాయమును సమకూర్చు ఎవరేని వ్యక్తి అని అర్థము;

(ఇ) "ధ్రువీకరించు ప్రాధికారి" అనగా 57వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నియుక్తుడైన ప్రాధికారి అని అర్థము;

(ఎఫ్) "సమాచారం" అనగా సమాచార ప్రరూపములు, భాషలు, మూలం ప్రదర్శన, బ్రెయిలీ, స్పర్శేంద్రియ సమాచారం, సైగలు, పొడవైన ముద్ర, బహుళార్థ మాధ్యమాల సౌలభ్యము,

---

1. 2017, ఏప్రిల్ 19 నాటి అధిసూచన సంఖ్య ఎస్.ఓ.1215(ఈ), తేదీ 2017, ఏప్రిల్ 19, 3(ii)వ పరిచ్ఛేదము, భాగము -II అసాధారణ, భారత రాజపత్రమును చూడుము.

వ్రాతపూర్వకమైన, దృశ్య, శ్రవణ, దృశ్య ప్రదర్శనలు, సైగ భాష, సాదా–భాషా, మానవ–చదువరి, అధికం చేసే మరియు ప్రత్యామ్నాయ విధానములు మరియు సమాచార సౌలభ్యము మరియు వార్తా ప్రసార సాంకేతిక విధానము అని అర్థము;

(జి) "సమర్థ ప్రాధికారి" అనగా 49వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన ప్రాధికారి అని అర్థము;

(హెచ్) దివ్యాంగతకు సంబంధించి "విచక్షణ" అనగా రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పౌర లేదా ఏదేని ఇతర రంగంలోని అన్ని విధములైన విచక్షణ మరియు సముచితమైన నివాసముతో సహా అన్ని మానవ హక్కులు మరియు ప్రాథమిక స్వతంత్రతలతో ఇతరులతో సమాన ప్రాతిపదికపై గుర్తింపు ఫలమును అనుభవించు లేదా వినియోగించుట, అనుభవించుటను బలహీనపరచు లేదా లేకుండా చేయు ఏదేని ప్రత్యేకత, మినహాయింపు, నిర్బంధన అని అర్థము;

(ఐ) "సంస్థ" అను పదములో ప్రభుత్వ సంస్థ, ప్రైవేటు సంస్థ అనునవి చేరియుండును;

(జె) "నిధి" అనగా 86వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన జాతీయ నిధి అని అర్థము;

(కె) "ప్రభుత్వ సంస్థ" అనగా కేంద్ర చట్టము లేదా రాజ్య చట్టము క్రింద ఏర్పాటు చేయబడిన కార్పోరేషను లేదా ప్రభుత్వ స్వామ్యత్వము లేదా నియంత్రణ కలిగి ఉన్న లేదా సహాయము పొందు ప్రాధికార సంస్థ లేదా నికాయము లేదా కంపెనీల చట్టము, 2013 (2013లోని 18వది) యొక్క 2వ పరిచ్ఛేదములో నిర్వచించబడినట్లుగా ఒక ప్రభుత్వ కంపెనీ అని అర్థము మరియు ప్రభుత్వ విభాగము ఇందులో చేరియుండును;

(ఎల్) "అధిక మద్ధతు" అనగా ప్రగాఢమైన మద్ధతు, భౌతిక, మానసిక బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన వ్యక్తికి ఆవశ్యకమగునట్టి లేదా ఇతరమైన దైనందిన కార్యకలాపములు అనగా సదుపాయములకు సౌలభ్యము నిమిత్తము స్వతంత్ర మరియు తెలియజేయబడిన నిర్ణయములను తీసుకొనుట మరియు విద్య, ఉపాధి, కుటుంబ మరియు సామాజిక జీవితము మరియు చికిత్స మరియు థెరపీతో సహా అన్ని జీవనరంగాలలో పాల్గొనేందుకు ఆవశ్యకమైన వాటి విషయములో అధిక మద్ధతు;

(ఎమ్) "సంఘటిత విద్య" అనగా దివ్యాంగత కలిగివున్న మరియు లేనటువంటి విద్యార్థులందరు కలిసి విద్య నేర్చుకొను పద్ధతి అని అర్థము మరియు దివ్యాంగతతో కూడిన విద్యార్థుల యొక్క వివిధ పద్ధతుల విద్యావసరములను తగురీతిగా తీర్చుకొనుటకు అనుసరించిన బోధన మరియు అధ్యయన పద్ధతి ఈ పదపరిధియందు చేరియుండును;

(ఎన్) "సమాచార మరియు వార్తా ప్రసార సాంకేతిక విధానము" అనగా సమాచార మరియు వార్తా ప్రసారమునకు సంబంధించిన అన్ని సేవలు మరియు ఆవిష్కరణలు చేరి యుండును. వీటిలో సందేశాలను దూరప్రాంతములకు పంపు టెలికాం సేవలు, వెబ్ ఆధారిత సేవలు, ఎలక్ట్రానిక్ మరియు ముద్రణ సేవలు, డిజిటల్ మరియు వర్చువల్ సేవలు చేరియుండును;

(ఓ) "సంస్థ" అనగా దివ్యాంగుల కొరకు స్వీకరణ, భద్రత, పరిరక్షణ, విద్య, శిక్షణ, పునరావాసము మరియు వారి కొరకైన ఏవేని ఇతర కార్యకలాపముల కొరకైన సంస్థ అని అర్థము;

(పి) "స్థానిక ప్రాధికార సంస్థ" అనగా సంవిధానము యొక్క 243పీ అనుచ్ఛేదపు ఖండము (ఇ) మరియు (ఎఫ్)లలో నిర్వచించబడినట్లుగా పురపాలిక లేదా పంచాయతీ, కంటోన్మెంట్ల చట్టము, 2006 (2006లోని 41వది) క్రింద ఏర్పాటు చేయబడిన కంటోన్మెంటు బోర్డు మరియు పౌర వ్యవహారముల పాలనకు పార్లమెంటు లేదా రాజ్య శాసనమండలి చట్టము క్రింద ఏర్పాటు చేయబడిన ఏదేని ఇతర ప్రాధికార సంస్థ అని అర్థము;

(క్యూ) "అధిసూచన" అనగా అధికారిక రాజపత్రములో ప్రచురించబడిన అధిసూచన అని అర్థము మరియు "అధిసూచించు" లేదా "అధిసూచిత" అను పదమును తదనుసారముగా అన్వయించుకొనవలెను;

(ఆర్) "బెంచ్‌మార్కు దివ్యాంగతతో కూడిన వ్యక్తి" అనగా కొలుచుటకు ఉపయోగించు పదములలో నిర్వచించబడని నిర్దిష్ట దివ్యాంగతలో నలభై శాతమునకు తక్కువకాని దివ్యాంగత గలిగిన వ్యక్తి అని అర్థము మరియు కొలుచుటకు ఉపయోగించు పదములలో నిర్వచించబడిన నిర్దిష్ట దివ్యాంగతగల వ్యక్తిగా ధ్రువీకృత అధికారిచే ధ్రువీకరించబడినట్టి దివ్యాంగత గల వ్యక్తి అని అర్థము;

(ఎస్) "దివ్యాంగతతో కూడిన వ్యక్తి" అనగా సంఘములో ఇతరులతో సమానముగా పూర్తిగా మరియు సమర్థవంతముగా పాల్గొనుటలో అవరోధములు, ఆటంకములు ఒకదానితో ఒకటి పనిచేయుట వలన దీర్ఘకాలిక భౌతిక, మానసిక, వివేకము లేదా జ్ఞానేంద్రియ వైకల్యము కలిగిన వ్యక్తి అని అర్థము;

(టి) "అధిక మద్ధతు అవసరమైన దివ్యాంగుడు" అనగా అధిక మద్ధతు అవసరమై ఉన్నట్టి, 58వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఎ) క్రింద ధ్రువీకరించబడిన బెంచ్ మార్కు దివ్యాంగుడు అని అర్థము;

(యు) "విహితపరచబడిన" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(వి) "ప్రైవేటు సంస్థ" అనగా ఒక కంపెనీ, ఫర్మ్, సహకార లేదా ఇతర సంఘము, అసోసియేషనులు, ట్రస్టు, ఏజెన్సీ, సంస్థ, వ్యవస్థాపన, యూనియను, ఫ్యాక్టరీ లేదా సముచిత ప్రభుత్వము అధిసూచన ద్వారా నిర్దిష్టపరచునట్టి ఇతర సంస్థ అని అర్థము;

(డబ్ల్యు) "పబ్లికు భవనము" అనగా పబ్లికు విస్తారముగా ఉపయోగించిన లేదా ప్రవేశ సౌలభ్యము కలిగిన ప్రభుత్వ లేదా ప్రైవేటు భవనము అని అర్థము. ఈ పదపరిధియందు, విద్యా విషయక లేదా వృత్తిపరమైన ప్రయోజనముల నిమిత్తము ఉపయోగించిన భవనము, పని స్థలము, వాణిజ్య కార్యకలాపములు, పబ్లికు ప్రయోజనములు, మతపరమైన, సాంస్కృతిక, విశ్రాంత లేదా వినోద కార్యకలాపములు, వైద్య లేదా ఆరోగ్య సేవలు, శాసనమును అమలుపరచు ఏజెన్సీలు, సంస్కరణాత్మక లేదా న్యాయికసంబంధ వేదికలు, రైల్వేస్టేషన్లు లేదా ప్లాటుఫారములు, రోడ్డు మార్గములు, బస్‌స్టాండులు లేదా టెర్మినళ్ళు, విమానాశ్రయములు లేదా జలమార్గములు చేరియుండును.

(ఎక్స్) "పబ్లికు సదుపాయములు మరియు సేవలు" అను పదబంధములో విస్తారముగా పబ్లికుసేవలు సమకూర్చు అన్ని పద్ధతులు చేరియుండును. గృహ నిర్మాణములు, విద్యా విషయిక మరియు వృత్తిపరమైన శిక్షణలు, ఉపాధి మరియు జీవనోపాధి, పురోభివృద్ధి, షాపింగు లేదా మార్కెటింగు, మతపరమైన, సాంస్కృతిక, విశ్రాంత లేదా వినోద, వైద్య, ఆరోగ్య మరియు పునరావాసము, బ్యాంకింగు, ఆర్థిక మరియు బీమా, వార్తా ప్రసారము, తపాల మరియు సమాచారం, న్యాయపాలన సౌలభ్యము, పబ్లికు ప్రయోజనములు మరియు రవాణా చేరియుండును;

(వై) "సముచిత వసతి" అనగా దివ్యాంగులు ప్రత్యేకమైన సందర్భములో ఇతరులతో సమానంగా హక్కులను అనుభవించుటలో లేదా వినియోగించుటకు మరియు అనుభవించుటలో అనుపాత రహితముగా లేదా అసంబద్ధ భారమును వారిపై మోపకుండా అవసరమైన మరియు తగిన మార్పులతో కూడిన వసతి అని అర్థము;

(జెడ్) "రిజిస్టరు చేయబడిన వ్యవస్థ" అనగా దివ్యాంగుల అసోసియేషను లేదా దివ్యాంగత కలిగిన వ్యక్తుల వ్యవస్థ, దివ్యాంగుల యొక్క తల్లిదండ్రుల అసోసియేషను, అట్టి దివ్యాంగుల మరియు వారి కుటుంబ సభ్యులు లేదా స్వచ్ఛంద లేదా ప్రభుత్వేతర అసోసియేషను లేదా ధార్మిక వ్యవస్థ లేదా ట్రస్టు, సంఘము లేదా పార్లమెంటు లేదా రాజ్య శాసనమండలి యొక్క చట్టము క్రింద తగురీతిగా రిజిస్టరైన దివ్యాంగుల సంక్షేమము కొరకు పని చేసే లాభరహిత కంపెనీ అని అర్థము;

(జెడ్ఎ) "పునరావాసము" దివ్యాంగుల పర్యావరణ లేదా సామాజిక కృత్యముల స్థాయిలో అత్యంత అనుకూలమైన, భౌతిక, సంవేదనాత్మక, వివేకము గల, మానసికముగా వికాసమును పొంది, దానిని కలిగి ఉండేందుకు ఉద్దేశించిన ప్రక్రియ.

(జెడ్బి) "ప్రత్యేక ఉపాధికల్పన సంస్థ" అనగా ఈ క్రింది విషయములలో రిజిస్టర్లను నిర్వహిస్తూ లేదా ఇతర విధముగా సమాచారమును సేకరిస్తూ మరియు సమకూరుస్తూ ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడిన మరియు నిర్వహించబడిన ఏదేని కార్యాలయము లేదా స్థలము అని అర్థము–

(i) దివ్యాంగులలో నుండి ఉద్యోగులను నియమించుకొనదలచిన వ్యక్తులు;

(ii) బెంచ్ మార్కు దివ్యాంగత గల వ్యక్తులలో ఉపాధిని కోరువారు;

(iii) బెంచ్ మార్కు దివ్యాంగత గల వ్యక్తులను నియమించుకొనుటకైన ఖాళీలు;

(జెడ్సి) "నిర్దిష్ట దివ్యాంగత" అనగా అనుసూచిలో నిర్దిష్టపరచబడిన దివ్యాంగతలు అని అర్థము;

(జెడ్డి) "రవాణా విధానములు" అను పదబంధములో రోడ్డు రవాణా, రైలు రవాణా, వాయు రవాణా, జల రవాణా, చివరి మైలు వరకు కలిపే రోడ్డు మరియు వీధి సదుపాయము మొదలైన ప్యారా రవాణా విధానములు;

(జెడ్ఇ) "విశ్వవ్యాప్త డిజైను" అనగా అనుసరణ లేదా ప్రత్యేకతలు కలిగిన డిజైన్ అవసరము లేని మరియు సాధ్యమైనంత వరకు అత్యధిక జనాభాచే ఉపయోగించబడు ఉత్పత్తులు, పర్యావరణ పరిస్థితులు, కార్యక్రమములు మరియు సేవలు, ముఖ్యముగా దివ్యాంగతలతో కూడిన వర్గముల వారికి అడ్వాన్సు సాంకేతికతలతో సహా, సహాయకారిగా ఉండే సాధనములు చేరియుండును.

## అధ్యాయము - II

## హక్కులు మరియు అర్హతలు

సమానత్వము మరియు విచక్షణారహితము.

3. (1) సముచిత ప్రభుత్వము, దివ్యాంగులు ఇతరులతో సమానంగా అతని లేదా ఆమె యొక్క సమానత్వము మరియు గౌరవముతో కూడిన మాన్యతతో జీవనమును అనుభవించేందుకు వీలు కలిగించవలెను.

(2) సముచిత ప్రభుత్వము, దివ్యాంగులకు తగిన పర్యావరణమును సమకూర్చుట ద్వారా వారు తమ శక్తి సామర్థ్యములను వినియోగించుకొనేందుకు వీలుగా చర్యలను చేపట్టవలెను.

(3) దివ్యాంగతతో కూడిన ఏ వ్యక్తిపైనగాని తన న్యాయ సమ్మతమైన లక్ష్యమును సాధించుటలో తదనుపాతమైన సాధనము ద్వారా ఆక్షేపిత చర్యను గావించినట్లు లేదా తదనుగుణంగా పనిచేయలేదనే కారణముపై తప్ప, అసమర్థత ఆధారముపై మాత్రమే పక్షపాత వైఖరితో వ్యవహరించరాదు.

(4) తన దివ్యాంగత ఆధారంగా మాత్రమే తన స్వేచ్ఛను ఏ వ్యక్తియు కోల్పోరాదు.

(5) సముచిత ప్రభుత్వము, దివ్యాంగుల కొరకు, సబబైన వసతిని సమకూర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకొనుటకు వీలు కల్పించవలెను.

దివ్యాంగత గల మహిళలు మరియు బాలలు.

4. (1) దివ్యాంగత గల మహిళలు మరియు బాలలు ఇతరులతో సమానంగా తమ యొక్క హక్కులను అనుభవించే విధముగా సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు అవసరమైన చర్యలు తీసుకొనుటకు వీలు కల్పించవలెను.

(2) దివ్యాంగత గల బాలలు అందరు తమకు సంబంధించిన అన్ని విషయములలో తమ ఉద్దేశములను స్వేచ్ఛగా తెలియజేయుటకు వీలుగా సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు సదరు బాలల వయస్సును మరియు వారి దివ్యాంగతలను దృష్టియందుంచుకొని తగిన మద్దతును సమకూర్చేందుకుగాను తగిన అన్ని చర్యలను చేపట్టవలెను.

సామాజిక జీవనము.

5. (1) దివ్యాంగులు సమాజంలోని ఇతరులతో సమానంగా జీవించేందుకు హక్కు కలిగి ఉండవలెను.

(2) సముచిత ప్రభుత్వము, దివ్యాంగులను–

(ఎ) ఏదేని ప్రత్యేకమైన ఏర్పాట్లలోనే జీవించాలని బద్ధులైయుండునట్లు చేయరాదు; మరియు

(బి) వయస్సు మరియు స్త్రీ, పురుష విషయములందు తగు గౌరవముతో జీవించడానికి అవసరమైన వ్యక్తిగత సహాయముతో సహా, గృహము లోపల, నివాసపరమైన మరియు ఇతర సామాజిక మద్ధతుతో ప్రవేశ సౌలభ్యమును కలుగజేయుట.

6. (1) సముచిత ప్రభుత్వము, దివ్యాంగులను వేధింపులు, క్రూరత్వము, అమానుష ప్రవర్తన లేదా చులకనచేసి వ్యాకులపరచుట నుండి రక్షించేందుకు చర్యలు చేపట్టవలెను. క్రూరత్వము మరియు అమానుష ప్రవర్తన నుండి రక్షణ.

(2) ఈ క్రిందివి లేకుండా, దివ్యాంగతతో కూడిన ఏ వ్యక్తియు ఏదేని పరిశోధనకు అధ్యధీనము చేయరాదు,-

(i) ప్రవేశ సౌలభ్యము గల పద్ధతులు, సాధనములు మరియు సమాచార ప్రరూపముల ద్వారా పొందిన అతని లేదా ఆమె యొక్క స్వేచ్ఛ మరియు తెలియజేసిన సమ్మతి; మరియు

(ii) దివ్యాంగుల సభ్యులతో గాని లేదా 2వ పరిచ్ఛేదపు ఖండము (జెడ్) క్రింద నిర్వచించబడినట్లుగా రిజిస్టరు చేయబడిన వ్యవస్థ యొక్క సభ్యులతో గాని సగము కంటే తక్కువగానట్టియు, సదరు ప్రయోజనము నిమిత్తము, విహిత రీతిలో సముచిత ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడిన దివ్యాంగతపై కమిటీ యొక్క పూర్వ అనుమతి.

7. (1) దివ్యాంగులను నింద, హింస మరియు దోపిడీల నుండి సంరక్షించేందుకు సముచిత ప్రభుత్వము వాటిని నివారించేందుకు ఈ క్రింది చర్యలను తీసుకొనవలెను,- నింద, హింస మరియు దోపిడీ నుండి రక్షణ.

(ఎ) నింద, హింస మరియు దోపిడీ సంఘటనలను విచారణార్హమైనవిగా చేయుట మరియు అట్టి సంఘటనల విషయముపై లభ్యంగా ఉన్న శాసనపరమైన ప్రత్యుపాయములను చేపట్టవలెను;

(బి) అట్టి సంఘటనలను నివారించేందుకు చర్యలు తీసుకొనుట మరియు వాటిని రిపోర్టుచేయు ప్రక్రియను విహితపరచుట;

(సి) అట్టి సంఘటనల బాధితులను కాపాడేందుకు, రక్షించేందుకు మరియు వారికి పునరావాసము కలిగించేందుకు చర్యలు తీసుకొనుట; మరియు

(డి) ప్రజలలో వారిపట్ల అవగాహనను కలిగించుట మరియు సమాచారమును ఎప్పటికప్పుడు సమకూర్చుట.

(2) దివ్యాంగతతో కూడిన ఎవరేని వ్యక్తిపై నింద, హింస లేదా దోపిడీ చేయబడినదని లేదా చేయబడుచున్నదని లేదా చేయబడగలదని విశ్వసించుటకు కారణమున్న ఎవరేని వ్యక్తి లేదా రిజిస్టరు చేయబడిన వ్యవస్థ దాని గురించిన సమాచారమును అట్టి సంఘటన సంభవించిన అధికారిత పరిధి గలిగిన కార్యనిర్వాహక మేజిస్ట్రేటుకు అందజేయవలెను.

(3) అట్టి సమాచారమును స్వీకరించిన మీదట కార్యనిర్వాహక మేజిస్ట్రేటు, అట్టి సంఘటన జరుగకుండా నిలిపివేయుటకు లేదా సందర్భానుసారము నివారించుటకు వెనువెంటనే చర్యలు చేపట్టవలెను లేదా ఈ క్రింది విధముగా తాను ఉచితమని భావించునట్టి ఉత్తరువు చేయుట ద్వారా అట్టి వ్యక్తికి భద్రతను కల్పించవలెను,-

(ఎ) అట్టి చర్య వలన బాధిత వ్యక్తిని కాపాడేందుకు మరియు భద్రతాపరమైన సంరక్షణలో లేదా సందర్భానుసారము పునరావాసమును సమకూర్చుటకు పోలీసు వలనే సదరు వ్యక్తుల కొరకు పనిచేయు ఏదేని వ్యవస్థకు ప్రాధికారము ఇచ్చేందుకు;

(బి) దివ్యాంగత గల వ్యక్తి ఆశించినచో అతనికి భద్రతతో కూడిన సంరక్షణను సమకూర్చుటకు;

(సి) అట్టి వ్యక్తికి నిర్వహణను సమకూర్చుటకు

– సంబంధించిన ఉత్తరువును కూడా జారీ చేయవలెను.

(4) ఎవరేని దివ్యాంగ వ్యక్తికి సంబంధించిన ఫిర్యాదు లేదా నింద, హింస లేదా దోపిడీకి సంబంధించిన సమాచారము తన దృష్టికి వచ్చిన ఎవరేని పోలీసు అధికారి, సదరు వ్యధితుని,–

(ఎ) ఉప–పరిచ్ఛేదము (2) క్రింద సంరక్షణ కొరకు దరఖాస్తు చేసుకొను అతని లేదా ఆమె యొక్క హక్కు మరియు సహాయమును సమకూర్చుటకు అధికారిత కలిగిన కార్యనిర్వాహక మేజిస్ట్రేటు యొక్క వివరములను;

(బి) అట్టి దివ్యాంగ వ్యక్తుల పునరావాసము కొరకు అత్యంత సమీపంలో పనిచేయు వ్యవస్థ లేదా సంస్థకు;

(సి) ఉచిత న్యాయ సహాయమును పొందుటకైన హక్కును; మరియు

(డి) ఈ చట్టము క్రింద అట్టి అపరాధమునకు సంబంధించిన ఏదేని ఇతర శాసనము యొక్క నిబంధనల క్రింద ఫిర్యాదు దాఖలుచేయు హక్కును

– తెలియజేయవలెను:

అయితే, ఈ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికినీ, విచారణార్హమైన అపరాధము జరుగు సమాచారమును స్వీకరించిన మీదట, శాసనము ననుసరించి, తన కర్తవ్య నిర్వహణ నుండి విడుదల అయి సంఘటన స్థలమునకు వెళ్లుటకు ఏ విధముగాను పోలీసు అధికారిని నివారించదు.

(5) భారత శిక్షాస్మృతి (1860లోని 45వది) క్రింద లేదా తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనమును అనుసరించి, ఆరోపిత చర్య లేదా ప్రవర్తన నిరంతరంగా కొనసాగుచున్నట్లు కార్యనిర్వాహక మేజిస్ట్రేటు అభిప్రాయపడినపుడు, సదరు ఫిర్యాదును, ఈ విషయములో అధికారిత పరిధి కలిగిన న్యాయిక లేదా మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటుకు సమర్పించవలెను.

సంరక్షణ మరియు భద్రత.

8. (1) దివ్యాంగులు, ప్రమాదము, సాయుధ పోరాటము, మానవీయ అత్యయిక పరిస్థితులు మరియు జాతీయ విపత్తులు సంభవించిన సందర్భాలలో సమాన సంరక్షణ మరియు భద్రతను కలిగి ఉండవలెను.

(2) దివ్యాంగుల సంరక్షణ మరియు భద్రత కొరకు విపత్తు నిర్వహణ చట్టము, 2005 (2005లోని 53వది) యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండము (ఇ) క్రింద నిర్వచించబడిన విధముగా సదరు కార్యకలాపములలో సదరు వ్యక్తులను కూడా చేర్చేందుకు జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ మరియు రాజ్య విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సముచితమైన చర్యలను తీసుకొనవలెను.

(3) విపత్తు నిర్వహణ చట్టము, 2005 (2005లోని 53వది) యొక్క 25వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన జిల్లా విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, జిల్లాలోని దివ్యాంగతలతో కూడిన సదరు వ్యక్తుల యొక్క వివరములు గల రికార్డును నిర్వహించవలెను. సదరు సంస్థ, సదరు పరిస్థితులలో విపత్తుకి తయారుగా ఉండుటకు తీసుకొనవలసిన చర్యల గురించి అట్టి వ్యక్తులకు స్పష్టముగా విశదీకరించవలెను.

(4) ప్రమాదము, సాయుధ పోరాటము లేదా జాతీయ విపత్తులు సంభవించిన ఏవేని పరిస్థితుల దరిమిలా పునర్ నిర్మాణ కార్యకలాపములలో నిమగ్నులైన ప్రాధికారులు దివ్యాంగుల యొక్క ఆవశ్యకముల ప్రవేశ సౌలభ్యముల ననుసరించి సంబంధిత రాజ్య కమీషనరుతో సంప్రదించి అట్టి కార్యకలాపములను చేపట్టవలెను.

గృహము మరియు కుటుంబము.

9. (1) బాలల యొక్క అత్యంత హితము మేరకు సమర్థ న్యాయస్థానము యొక్క ఉత్తరువుపై ఆ విధముగా కోరిననే తప్ప, దివ్యాంగత ఆధారంగా మాత్రమే అతని లేదా ఆమె యొక్క తల్లిదండ్రుల నుండి విడిగా ఉంచరాదు.

(2) దివ్యాంగతతో కూడిన బాలల యొక్క భద్రతను వారి తల్లిదండ్రులు చూసుకొనలేనపుడు, సమర్థ న్యాయస్థానము అతని లేక ఆమె యొక్క దగ్గరి బంధువుల సంరక్షణలో ఉంచవలెను అదే సమాజములో అట్లు చేయుటకు వీలుకానపుడు, లేదా అసాధారణ పరిస్థితులలో సముచిత ప్రభుత్వముచే లేదా ప్రభుత్వేతర వ్యవస్థలచే నిర్వహించబడు ఆవాస గృహములో వారికి వసతిని కల్పించవలెను.

పునరుత్పత్తి హక్కులు.

10. (1) దివ్యాంగుల పునరుత్పత్తి మరియు కుటుంబ నియంత్రణ గురించిన సముచితమైన సమాచారమునకు సముచిత ప్రభుత్వము తగు శ్రద్ధ వహించవలెను.

(2) అతని లేదా ఆమె యొక్క స్వేచ్ఛ మరియు తెలియజేయబడిన సమ్మతి లేకుండా వంధ్యత్వం చేయునట్టి ఏదేని వైద్య ప్రక్రియకు దివ్యాంగతలతో కూడిన ఏవ్యక్తి దానికి అధ్యధీనము కాకుండా చూడవలెను.

ఓటు వేయుటలో ప్రవేశ సౌలభ్యము.

11. భారత ఎన్నికల కమీషన్ మరియు రాజ్య ఎన్నికల కమీషన్‌లు దివ్యాంగులకు అన్ని పోలింగు స్టేషన్లలోను వారికి ప్రవేశ సౌలభ్యము గావించవలెను మరియు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని సాధన సామాగ్రిని వారికి సులభముగా అందుబాటులో ఉంచవలెను.

న్యాయ ప్రక్రియా సౌలభ్యము.

12. (1) దివ్యాంగులకు ఏదేని న్యాయస్థానము, ట్రిబ్యునలు, ప్రాధికార సంస్థ, కమీషన్ లేదా న్యాయిక లేదా సదృశ న్యాయిక లేదా దర్యాప్తుపరమైన అధికారములను కలిగివున్న ఇతర నికాయమునకు, దివ్యాంగత ఆధారంగా విచక్షణారహితంగా ప్రవేశ సౌలభ్యమును వినియోగించుకొనుటకు సమర్థ ప్రభుత్వము తగుశ్రద్ధ వహించవలెను.

(2) దివ్యాంగులు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్న మరియు వారు తమ న్యాయపరమైన హక్కులను వినియోగించుకొనేందుకు అధిక మద్దతు కోరే వారికి సముచిత ప్రభుత్వము తగిన మద్దతును వారికి అందుబాటులో ఉంచవలెను.

(3) న్యాయ సేవల ప్రాధికార సంస్థల చట్టము, 1987 (1987లోని 39వది) క్రింద ఏర్పాటు చేయబడిన జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ మరియు రాజ్య న్యాయ సేవల సంస్థలు, ఏదేని పథకము, కార్యక్రమము, సదుపాయమును లేదా ఇతరులతో సమానంగా దివ్యాంగులకు సబబైన వసతిని సమకూర్చుటతో పాటు నిబంధనలను చేయవలెను.

(4) సముచిత ప్రభుత్వము ఈ క్రింది వాటి విషయములో చర్యలను చేపట్టవలెను,-

(ఎ) వారి యొక్క పబ్లికు దస్తావేజులన్నింటిని ప్రవేశ సౌలభ్యముగల ప్రరూపములలో ఉంచుటకు;

(బి) ప్రవేశ సౌలభ్యముగల రీతిలో ప్రరూపములలో దాఖలు చేయుటకు, నిల్వ చేయుటకు మరియు దస్తావేజులు మరియు సాక్ష్యములు నిర్దేశించుటకు అవసరమైన సాధన సామాగ్రిని దాఖలు చేసే విభాగాలు, రిజిస్ట్రీ లేదా ఏదేని ఇతర కార్యాలయ రికార్డులు;

(సి) మూజువాణీ సాక్ష్యములు, వాద ప్రతివాదములు లేదా దివ్యాంగులు ఎంచుకొనిన భాష మరియు భావ వ్యక్తీకరణ సాధనములతో రికార్డు చేయుటకు అవసరమైన అన్ని సదుపాయములు మరియు సాధన సామాగ్రిని లభ్యముగావించవలెను.

శాసనిక స్తోమత.

13. (1) దివ్యాంగులు ఇతరులతో సమానంగా స్థిర లేదా చరాస్తులను కలిగి ఉండుటకు లేదా ఆర్థిక వ్యవహారములలో నియంత్రణను మరియు బ్యాంకు రుణములను, తనఖాలు మరియు ఇతర పరపతి రుణముల ప్రరూపములు పొందుటకు ప్రవేశ సౌలభ్యమును కలిగి ఉండేందుకు సముచిత ప్రభుత్వము తగు శ్రద్ధ వహించవలెను.

(2) జీవితములోని అన్ని విషయములలోను మరియు శాసనము సమక్షములో ఎవరేని ఇతర వ్యక్తులతో సమానమైన గుర్తింపును పొందుటకు హక్కును కలిగి ఉండేందుకు శాసనిక స్తోమతను అనుభవించుటకు దివ్యాంగులపట్ల సముచిత ప్రభుత్వము తగు శ్రద్ధ వహించవలెను.

(3) ఒక ప్రత్యేకమైనట్టి ఆర్థిక విషయములో ఆస్తి లేదా ఇతర ద్రవ్య సంబంధమైన లావాదేవీల సందర్భములో మద్ధతును సమకూర్చు వ్యక్తిని మరియు దివ్యాంగతతో కూడిన వ్యక్తికి అభిప్రాయ భేదము ఏర్పడినపుడు సదరు మద్ధతుదారు తన మద్ధతును విరమించుకొనవచ్చును:

అయితే, మద్ధతునిచ్చే వ్యక్తి, దివ్యాంగతతో కూడిన వ్యక్తికి మధ్యగల రక్త సంబంధం లేదా దత్తత స్వీకార సంబంధము ఆధారంగా మాత్రమే అభిప్రాయబేధము ఏర్పడినట్లు పురోభావన చేసుకొనరాదు.

(4) దివ్యాంగతతో కూడిన వ్యక్తి ఏదేని మద్ధతు ఏర్పాటును పరివర్తనము చేసుకొనవచ్చును, మార్పు చేసుకొనవచ్చును లేదా నాశనము గావించుకొనవచ్చును మరియు మరొకరి మద్ధతును కోరవచ్చును:

అయితే, అట్టి ఏదేని మద్ధతు ఏర్పాటు యొక్క పరివర్తన, మార్పు లేదా శాసనము భవిష్యత్తుకు సంబంధించినదిగా ఉండవలెను మరియు దివ్యాంగతతో కూడిన వ్యక్తి పైన పేర్కొనబడిన మద్దతు ఏర్పాటు, ఎవరేని మూడవ కక్షిదారునితో లావాదేవీని శూన్యపరచరాదు.

(5) దివ్యాంగతతో కూడిన వ్యక్తికి మద్ధతును సమకూర్చే వ్యక్తి, తన అనుచిత ప్రభావమును ప్రదర్శించకుండా అతని లేదా ఆమె యొక్క స్వయం ప్రతిపత్తికి, మాన్యతకు మరియు గోప్యతకు తగిన శ్రద్ధ వహించవలెను.

సంరక్షకత్వము కొరకు నిబంధన.

14. (1) తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనములో ఏమి ఉన్నప్పటికినీ, ఈ చట్టము ప్రారంభమున మరియు అప్పటి నుండి జిల్లా న్యాయస్థానము లేదా రాజ్య ప్రభుత్వముచే హోదా కల్పించబడినట్లు అధిసూచించబడిన ఎవరేని ప్రాధికారి, దివ్యాంగతతో కూడిన వ్యక్తి తగినంత మరియు సముచితమైన మద్ధతు సమకూర్చబడినప్పటికినీ ఆయన శాసనబద్ధమైన నిర్ణయములను తీసుకొనలేకపోతున్నట్లు కనుగొనినయెడల, అట్టి వ్యక్తితో సంప్రదించి రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో అతని తరఫున శాసనబద్ధమైన నిర్ణయములు తీసుకొనుటకు పరిమిత సంరక్షకత్వము కలిగిన మరింత మద్ధతును సమకూర్చవచ్చును:

అయితే, జిల్లా న్యాయస్థానము లేదా సందర్భానుసారము పదాభిదానము కల్పించబడిన ప్రాధికారి, అట్టి మద్ధతును కోరు దివ్యాంగతతో కూడిన వ్యక్తికి మొత్తము మద్ధతును మంజూరు చేయవచ్చును లేదా సమకూర్చవలసి ఉండునట్టి మద్ధతు స్వభావము మరియు రీతిని న్యాయస్థానముచే లేదా హోదా కల్పించబడిన ప్రాధికారిచే పునర్విలోకనము చేయబడవలసి యుండునట్టి నిర్ణయమును తరచుగా మంజూరు చేయవలసి ఉండు పరిమిత సంరక్షకత్వమును మంజూరు చేయవచ్చును.

**విశదీకరణ :** ఈ పరిచ్ఛేదము నిమిత్తము "పరిమిత సంరక్షకత్వము" అనగా సంరక్షకుడు మరియు దివ్యాంగతలతో కూడిన వ్యక్తికి మధ్య పరస్పర అవగాహన మరియు విశ్వాసముపై అమలుజరుగు ఉమ్మడి విధానము అని అర్థము. అది నిర్దిష్ట కాలావధికి మరియు నిర్దిష్ట నిర్ణయము మరియు పరిస్థితికి పరిమితమై ఉండును మరియు సదరు దివ్యాంగతతో కూడిన వ్యక్తి యొక్క అభీష్టము మేరకు అమలు చేయబడవలెను.

(2) దివ్యాంగతతో కూడిన వ్యక్తి కొరకు ఈ చట్టము ప్రారంభ తేదీ మరియు అప్పటి నుండి తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనపు ఏదేని నిబంధన క్రింద నియమించబడిన ప్రతి సంరక్షకుడు పరిమిత సంరక్షకుడుగానే పని చేయునట్లు భావించవలెను.

(3) శాసనిక సంరక్షకుని నియమిస్తూ పదాభిదానము కల్పించబడిన ప్రాధికారిచే చేయబడిన నిర్ణయము వలన వ్యధితుడైన సదరు దివ్యాంగత కలిగిన వ్యక్తి, ఇందు నిమిత్తము రాజ్య ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి అపిలేటు ప్రాధికారికి అపీలును దాఖలు చేసుకొనవచ్చును.

మద్ధతు నిమిత్తము పదాభిదానము కల్పించబడిన ప్రాధికారులు.

15. (1) దివ్యాంగతలతో కూడిన వ్యక్తులు తమ శాసనిక స్తోమతను ఉపయోగించుకొనుటకు సదరు సమాజమును సమీకరించి, అట్టి వ్యక్తులకు మద్ధతు కలిగించేందుకు సామాజిక స్పృహను కలిగించడానికి, సముచిత ప్రభుత్వము ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రాధికారులకు పదాభిదానము కల్పించవచ్చును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద పదాభిదానము కల్పించబడిన ప్రాధికారి, సంస్థలలో నివసించే దివ్యాంగతలతో కూడిన వ్యక్తులు తమ శాసనిక స్తోమతను వినియోగించుకొనేందుకు తగిన మద్ధతు ఏర్పాట్లు గావించేందుకు మరియు అధిక మద్ధతు అవసరములు కలిగిన మరియు వారికి ఆవశ్యకమగునట్టి ఇతర చర్యలను చేపట్టవలెను.

## అధ్యాయము - III

## విద్య

విద్యా సంస్థల కర్తవ్యము.

16. దివ్యాంగతలతో కూడిన బాలలకు, సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు తాము ఆర్థిక సహాయము చేసేవారిచే గుర్తించబడిన అన్ని విద్యా సంస్థలు విద్యతో కలిపి మరికొన్నింటిని గరపేందుకు శ్రద్ధ వహించవలెను. ఆ లక్ష్యసిద్ధి కొరకు-

(i) ఎట్టి విచక్షణ లేకుండా వారిని చేర్చుకొని, విద్యను సమకూర్చి, ఇతరులతో సమానంగా క్రీడలు మరియు వినోద కార్యకలాపముల అవకాశములను కల్పించవలెను;

(ii) అందు నిమిత్తం క్యాంపసులను మరియు వివిధ సదుపాయములకు ప్రవేశ సౌలభ్యమును చేకూర్చవలెను;

(iii) వైయక్తిక వ్యక్తులకు వారి వారి ఆవశ్యకతల మేరకు సబబైన నివాస వసతులను సమకూర్చవలెను;

(iv) అన్ని లక్ష్యములు చేకూరే విధముగా గరిష్టమైన విద్యావిషయములను మరియు సామాజిక అభివృద్ధికి అవసరమైన మద్ధతును సమకూర్చవలెను.

(v) గుడ్డి లేదా చెవిటి లేదా రెండు లోపములతో కూడిన వ్యక్తులకు అత్యంత సముచితమైన భాషలు మరియు సంభాషణముల విధానముతో విద్యను భోదించేందుకు శ్రద్ధ వహించవలెను;

(vi) ప్రారంభంలోనే బాలలలో గల నిర్దిష్ట అధ్యయన దివ్యాంగతలను కనుగొని తగిన విద్యాబోధనలను చేపట్టి ఆ సమస్యలను అధిగమించేందుకు ఇతర చర్యలను కూడా తీసుకొనవలెను;

(vii) దివ్యాంగతతో ఉన్న ప్రతి విద్యార్థి విషయంలో పాల్గొనుటను, సాధించిన ప్రగతి స్థాయిలను పర్యవేక్షించి, విద్యను పూర్తి చేయునట్లు తగిన శ్రద్ధను చూపవలెను;

(viii) సదరు బాలలకు రవాణా సదుపాయములను మరియు అధిక మద్ధతు అవసరమైన వారికి సహాయకులను కూడా సమకూర్చవలెను.

సమ్మిళిత విద్యను ప్రోత్సహించుటకు మరియు సదుపాయం కల్పించుటకు నిర్దిష్ట చర్యలు.

17. 16వ పరిచ్ఛేదము నిమిత్తము, సముచిత ప్రభుత్వము స్థానిక ప్రాధికార సంస్థలు, ఈ క్రింది చర్యలను చేపట్టవలెను, అవేవనగా:-

(ఎ) దివ్యాంగతలతో కూడిన బాలలలో పాఠశాలకు వెళ్లేవారిని ప్రతి ఐదు సంవత్సరముల కొకసారి సర్వేను నిర్వహించి వారి ఆవశ్యకతల మేరకు అట్టి వారిని గుర్తించుట;

అయితే, ఈ చట్టము యొక్క ప్రారంభ తేదీ నుండి రెండు సంవత్సరముల కాలావధి లోపల మొదటి సర్వేను నిర్వహించవలసి ఉండును;

(బి) తగినన్ని ఉపాధ్యాయ శిక్షణ సంస్థలను ప్రారంభించుట;

(సి) సైగల భాషలోను మరియు అంధలిపిలో అర్హులైనట్టి దివ్యాంగత గలిగిన ఉపాధ్యాయులతో సహా, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి వారిని నియమించుటకు మరియు మానసికంగా దివ్యాంగత కలిగిన బాలలకు బోధన విషయంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించుటకు శ్రద్ధవహించవలెను;

(డి) పాఠశాల విద్య అన్ని స్థాయిలలో విద్యతో కలిపి మద్దతును సమకూర్చే వృత్తి విద్యార్హతలు గల వారికి శిక్షణ ఇచ్చి సిబ్బందిని సమకూర్చవలెను.

(ఇ) పాఠశాల విద్య అన్ని స్థాయిలలో, విద్యా సంస్థలకు తోడుగా తగినన్ని వనరుల కేంద్రములను ఏర్పాటు చేయుట;

(ఎఫ్) సంభాషణ లేదా భాషాపరమైన దివ్యాంగతలు గల వ్యక్తుల దైనందిన అవసరములను తెలియజేయుటలో సంభాషణకు అనుబంధంగా ఉండునట్లు తెలియజేయు సాధనము, అంధలిపి మరియు సైగలతో కూడిన భాషను మరియు ప్రరూపములతో సహా సముచితమైన విధముగా అధికముగావించేందుకు మరియు సమాజము మరియు సంఘములో తమ వంతుగా పాల్గొని తగిన సహకారమును సమకూర్చేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులను పెంపొందించుటకు;

(జి) బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన విద్యార్థులకు పద్దెనిమిది సంవత్సరముల వయస్సు వచ్చునంత వరకు ఉచితముగా పుస్తకములు, ఇతర అభ్యసన వస్తు సామాగ్రి మరియు తగిన సముచిత సహాయక సాధనములను సమకూర్చుట;

(హెచ్) బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన విద్యార్థులకు, సముచితమైన సందర్భములలో స్కాలరుషిప్పులను సమకూర్చుట;

(ఐ) దివ్యాంగతలతో కూడిన విద్యార్థుల అవసరములను తీర్చేందుకు అనగా పరీక్ష పేపరును పూర్తి చేయడానికి అధిక సమయాన్ని, వ్యాసకారుని సదుపాయము లేదా లేఖకుని సదుపాయము మరియు రెండవ మరియు మూడవ భాషా కోర్సుల నుండి మినహాయింపు వంటి వాటి విషయములో పాఠ్య ప్రణాళిక మరియు పరీక్షా విధానములో తగిన మార్పులు చేయుట;

(జె) అభ్యసనమును మెరుగుపరచేందుకు పరిశోధనను పురోభివృద్ధి గావించుట;

(కె) అవసరమైనట్టి ఏవేని ఇతర చర్యలు.

18. దివ్యాంగతలతో కూడిన వ్యక్తులు, ఇతరులతో సమానంగా వయోజన విద్యలో పురోభివృద్ధికి, రక్షణకు మరియు పాల్గొనడానికి సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు చర్యలను చేపట్టవలెను. వయోజన విద్య.

## అధ్యాయము – IV

## నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి

19. (1) దివ్యాంగులకు ప్రత్యేకంగా వృత్తిపరమైన శిక్షణ మరియు స్వయం ఉపాధి కొరకు రాయితీ రేట్లపై రుణములు సమకూర్చడంతోపాటు పథకములు మరియు కార్యక్రమములను సముచిత ప్రభుత్వము రూపకల్పన చేయవలెను. వృత్తిపరమైన శిక్షణ మరియు స్వయం ఉపాధి.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో నిర్దేశించబడిన పథకములు మరియు కార్యక్రమములు ఈ క్రింది వాటిని సమకూర్చవలెను-

(ఎ) వృత్తిపరమైన నియత మరియు అనియత శిక్షణ పథకములు మరియు కార్యక్రమముల ప్రధాన విషయములలో దివ్యాంగుడిని చేర్చుట;

(బి) దివ్యాంగుడు నిర్ధిష్టమైన శిక్షణను పొందేందుకు తగినంత మద్దతు మరియు సదుపాయములను వినియోగించుకొనుటకు వీలుకల్పించుట;

(సి) అభివృద్ధిపరమైన, వివేకంతో కూడిన, బహువిధ దివ్యాంగతలు మరియు తన ఆలోచనలో లీనమై ఉండునట్టి మానసిక వ్యాధిగల దివ్యాంగులు మార్కెటులో చురుకైన సంబంధములు కలిగి ఉండేందుకు వీలుగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమములను అందుబాటులో ఉండునట్లు చూచుట;

(డి) మైక్రో క్రెడిట్‌తో పాటు రాయితీ రేట్లపై రుణములు సమకూర్చుట;

(ఇ) దివ్యాంగులచే చేయబడిన ఉత్పత్తులకు మార్కెటింగు సదుపాయములు కల్పించుట;

(ఎఫ్) దివ్యాంగులతో పాటు నైపుణ్య శిక్షణ మరియు స్వయం ఉపాధిలో సాధించిన ప్రగతిపై సగటు రహిత డేటాను నిర్వహించుట.

ఉపాధికల్పనలో విచక్షణ లేకుండుట.

20. (1) ఉపాధికి సంబంధించిన ఏ విషయములోనైనను దివ్యాంగతతో కూడిన ఎవరేని వ్యక్తిపై ఎట్టి ప్రభుత్వ సంస్థయు విచక్షణను చూపరాదు:

అయితే, సముచిత ప్రభుత్వము అధిసూచన ద్వారా మరియు ఏవేని షరతులున్నయెడల వాటికి అధ్యధీనమై, ఏదేని సంస్థలో నిర్వహించబడే పని రకమును గురించి, ఈ పరిచ్ఛేదపు నిబంధనల నుండి ఏదేని సంస్థను మినహాయించవచ్చును.

(2) దివ్యాంగులకు ప్రతి ప్రభుత్వ సంస్థ సబబైన నివాస వసతిని మరియు సముచితమైనట్టియు అడ్డంకులు లేని, హితకరమైన వాతావరణ పరిస్థితిని సమకూర్చవలెను.

(3) దివ్యాంగత ఆధారంగా మాత్రమే ఏ వ్యక్తికి పదోన్నతిని నిరాకరించరాదు.

(4) ఒక ఉద్యోగి అతని లేదా ఆమె సర్వీసు కాలములో ఏదేని అసమర్థతకు గురి అయినపుడు ఏ ప్రభుత్వ సంస్థయు అతనిని పని నుండి విరమింపజేయరాదు లేదా సదరు ఉద్యోగి యొక్క హోదాను తగ్గించరాదు:

అయితే, దివ్యాంగతకు గురి అయిన ఉద్యోగి, ఆయన కలిగివున్న పదవికి తగిన వ్యక్తి కానపుడు, అదే వేతనపు స్కేలు మరియు సర్వీసు ప్రయోజనములు కలిగిన మరొక పదవికి సదరు ఉద్యోగిని తరలించవలెను:

అంతేకాక, సదరు ఉద్యోగి ఏ ఇతర పదవిలో సర్దుబాటు చేయుటకు వీలుకానపుడు, తగిన పదవి లభించేంతవరకు సూపర్ న్యూమరరీ పదవిలో లేదా పదవీ విరమణ వయస్సు వచ్చునంత వరకు, వీటిలో ఏది ముందు అయితే అంతవరకు సదరు ఉద్యోగిని ఉంచవచ్చును.

(5) దివ్యాంగతలతో కూడిన ఉద్యోగుల యొక్క పోస్టింగు మరియు బదిలీల కొరకైన విధి విధానములను సముచిత ప్రభుత్వము రూపకల్పన చేయవచ్చును.

21. (1) కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో, ఈ చట్టపు నిబంధనల ననుసరించి తీసుకొనదలచిన ప్రతిపాదిత చర్యలను వివరిస్తూ సమాన అవకాశము గల విధి విధానమును ప్రతి సంస్థ అధిసూచించవలెను. సమాన అవకాశము గల విధి విధానము.

(2) ప్రతి సంస్థ సదరు విధి విధానపు ప్రతిని ముఖ్య కమీషనరు లేదా సందర్భానుసారము రాజ్య కమీషనరు వద్ద రిజిస్టరు చేయవలెను.

22. (1) కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపము మరియు రీతిలో, ఈ చట్టపు నిబంధనలను పాటించుటలో అవసరమైన ఇతర సమాచారమును మరియు ఉపాధికి సంబంధించిన విషయము సమకూర్చబడిన సదుపాయములు వివరిస్తూ దివ్యాంగుల యొక్క రికార్డులను ప్రతి సంస్థ నిర్వహించవలెను. రికార్డుల నిర్వహణ.

(2) ఉపాధిని కోరునట్టి దివ్యాంగుల యొక్క రికార్డులను ప్రతి ఉపాధి కల్పన కేంద్రము నిర్వహించవలెను.

(3) ఉప–పరిచ్ఛేదము (1) క్రింద నిర్వహించబడిన రికార్డులను, ఈ విషయములో సముచిత ప్రభుత్వముచే ప్రాధికారమీయబడునట్టి వ్యక్తులచే తనఖీ నిమిత్తము అన్ని సబబైన వేళలయందు బహిరంగపరచవలెను.

23. (1) 19వ పరిచ్ఛేదము నిమిత్తము ప్రతి ప్రభుత్వ సంస్థ, వ్యధల నివారణ అధికారిని నియమించవలెను మరియు సదరు విషయమును ముఖ్య కమీషనరు లేదా సందర్భానుసారము రాజ్య కమీషనరుకు తెలియజేయవలెను. వ్యధల నివారణ అధికారి యొక్క నియామకము.

(2) 20వ పరిచ్ఛేదపు నిబంధనలను పాటించనందున వ్యధితుడైన ఎవరైనా వ్యక్తి, వ్యధల నివారణ అధికారికి ఫిర్యాదు దాఖలు చేసుకొనవచ్చును. ఆయన దాని విషయములో దర్యాప్తు జరిపి, దిద్దుబాటు చర్య నిమిత్తము సదరు సంస్థతో ఆ విషయమును చేపట్టవలెను.

(3) కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో వ్యధల నివారణ అధికారి, అట్టి ఫిర్యాదుల రిజిస్టరును నిర్వహించవలెను మరియు రిజిస్ట్రీకరణ జరిగిన రెండు వారముల లోపల ప్రతి ఫిర్యాదు గురించి విచారణ జరుపవలెను.

(4) అతను లేదా ఆమె యొక్క ఫిర్యాదు విషయములో తీసుకొనిన చర్య విషయములో సంతృప్తి చెందని వ్యధిత వ్యక్తి, దివ్యాంగతపై జిల్లా స్థాయి కమిటీని సంప్రదించవచ్చును.

## అధ్యాయము – V

## సామాజిక భద్రత, ఆరోగ్యము, పునరావాసము మరియు వినోదము

24. (1) సముచిత ప్రభుత్వము తన ఆర్థిక స్తోమత మరియు అభివృద్ధి పరిమితిలోపల దివ్యాంగులు స్వేచ్ఛగా లేదా సాముదాయకముగా నివసించేందుకుగాను తగిన ప్రామాణిక జీవితమును గడిపేందుకు తగిన రక్షణలతో మరియు హక్కును ప్రోత్సహించడానికిని అవసరమైన పథకములు మరియు కార్యక్రమములను రూపొందించుకొనవలెను: సామాజిక భద్రత.

అయితే, అట్టి పథకములు మరియు కార్యక్రమముల క్రింద దివ్యాంగులకు ఇతరులకు వర్తించే దాని కంటే కనీసము ఇరవై ఐదు శాతము అధికముగా ఉండవలెను.

(2) సముచిత ప్రభుత్వము ఈ పథకములు మరియు కార్యక్రమములను రూపొందించునపుడు, దివ్యాంగుల దివ్యాంగత, స్త్రీ, పురుష తేడాలను, వయస్సును మరియు సాంఘిక–ఆర్థిక స్థాయిని పర్యాలోచనలోనికి తీసుకొనవలెను.

(3) ఉప–పరిచ్ఛేదము (1) క్రింద పథకములు, ఈ క్రింది వాటిని సమకూర్చవలెను–

(ఎ) భద్రత, పారిశుద్ధ్యము, ఆరోగ్య సంరక్షణ మరియు సలహా విషయములతో కూడిన శుభప్రదమైన విధముగా సాముదాయక కేంద్రములు ఉండవలెను;

(బి) కుటుంబ సభ్యులతో నివసించని దివ్యాంగతలతో కూడిన బాలలు లేదా పరిత్యజించబడినట్టి వారు లేదా నివాసము లేదా జీవనోపాధిలేని వారికి సదుపాయములు సమకూర్చవలెను;

(సి) ప్రకృతి లేదా మానవ–నిర్మిత విపత్తుల సమయములో అవసరమైన మద్ధతును సమకూర్చవలెను;

(డి) దివ్యాంగతలతో కూడిన మహిళల జీవనోపాధి మరియు వారి బాలలను ఉద్ధరించేందుకు మద్ధతును సమకూర్చుట;

(ఇ) ముఖ్యముగా పట్టణ మురికివాడలు మరియు గ్రామీణ ప్రాంతములలో సురక్షితమైన త్రాగునీరు మరియు తగిన మరియు అందుబాటులో గల పారిశుధ్య సౌకర్యములతో ఉండవలెను;

(ఎఫ్) అధిసూచించబడునట్టి గరిష్ట ఆదాయ పరిమితితో, దివ్యాంగులకు సహాయము మరియు పరికరములు, మందులు, రోగ నిర్ధారణ సేవలు మరియు ఉచితముగా సరియైన సర్జరీని సమకూర్చుట;

(జి) అధిసూచించబడునట్టి గరిష్ట ఆదాయ పరిమితికి లోబడి దివ్యాంగులకు దివ్యాంగతా పింఛను;

(హెచ్) రెండు సంవత్సరములకు మించి ప్రత్యేక ఉపాధికల్పన సంస్థలో రిజిస్టరై ఉండి మరియు ఎట్టి లాభదాయకమైన వృత్తిలో ఉపాధిని పొందని అసమర్థతలతో కూడిన వ్యక్తులకు నిరుద్యోగ భృతి;

(ఐ) అధికమైన మద్ధతు అవసరములు కలిగిన దివ్యాంగుల సంరక్షకునికి భత్యము;

(జె) ఉద్యోగుల రాజ్య బీమా పథకములు లేదా ఏదేని ఇతర శాసనబద్ధమైన సంస్థ లేదా ప్రభుత్వ ప్రాయోజిత బీమా పథకములు వర్తించని, దివ్యాంగులకు సమగ్ర బీమా పథకము;

(కె) సముచిత ప్రభుత్వము ఉచితమని భావించునట్టి ఏదేని ఇతర విషయము.

25. (1) సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు, దివ్యాంగులకు అవసరమైన ఈ క్రింది చర్యలను చేపట్టవలెను,– ఆరోగ్య సంరక్షణ.

(ఎ) అధిసూచించబడునట్టి కుటుంబ ఆదాయమునకు లోబడి సమీప ప్రాంతంలో ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలలో ఉచిత ఆరోగ్య సంరక్షణ;

(బి) ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులు మరియు ఇతర ఆరోగ్య సంరక్షణ సంస్థలు మరియు కేంద్రముల అన్ని భాగములలో ఆటంక రహిత ప్రవేశ సౌలభ్యము;

(సి) వైద్య సేవల నిమిత్తము హాజరగుట మరియు చికిత్స కొరకు అగ్ర ప్రాధాన్యతను అవలంభించుట.

(2) ఆరోగ్య సంరక్షణను పెంపొందించుటకు మరియు దివ్యాంగతలు సంభవించుటను నివారించేందుకు మరియు సదరు ప్రయోజనము నిమిత్తము సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు అవసరమైన చర్యలు చేపట్టి మరియు అందు నిమిత్తము పథకములు లేదా కార్యక్రమములను చేపట్టవలెను–

(ఎ) దివ్యాంగతలు సంభవించుటకు గల కారణాలకై సర్వేలు, దర్యాప్తులు మరియు పరిశోధన చేపట్టుట లేదా చేపట్టునట్లు చూచుట;

(బి) దివ్యాంగతలను అరికట్టేందుకు వివిధ పద్ధతులను పెంపొందించుట;

(సి) "ప్రమాదములో ఉన్న" కేసులను గుర్తించేందుకు కనీసము సంవత్సరములో ఒకసారి బాలలకు ఆరోగ్య నిర్ణయ పరీక్షను చేయుట;

(డి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రములలోని సిబ్బందికి శిక్షణ గరిపేందుకు సదుపాయములు సమకూర్చుట;

(ఇ) సాధారణ ఆరోగ్య రక్షణ, ఆరోగ్యము మరియు పారిశుద్ధ్యమునకు సంబంధించిన ప్రాయోజిత సమాచారము ద్వారా జాగృతిపరచుట లేదా జాగృతి పరచునట్లు చూచుటకు ప్రచారముగావించుట మరియు సదరు సమాచారమును వ్యాప్తి చేయుట లేదా వ్యాప్తి చేయుటకు బాధ్యత వహించుట;

(ఎఫ్) తల్లి, బిడ్డ యొక్క ప్రసవపూర్వ, ప్రసవకాలిక మరియు ప్రసవానంతర సంరక్షణ కొరకు చర్యలు చేపట్టుట;

(జి) పాఠశాలల దశకు ముందు, పాఠశాలల స్థాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రములు, గ్రామస్థాయి పనివారలు మరియు అంగన్‌వాడి పనివారల ద్వారా ప్రజలను విద్యావంతులను గావించుట;

(హెచ్) దివ్యాంగతలు ఏర్పడుటకు కారణములు మరియు అనుసరించవలసిన నివారణ చర్యలు;

(ఐ) ప్రకృతి విపత్తులు మరియు ఇతర ప్రమాద పరిస్థితుల సమయములో ఆరోగ్య సంరక్షణ;

(జె) ప్రాణరక్షణ అత్యవసర చికిత్స మరియు ప్రక్రియల కొరకు ఆవశ్యక వైద్య సౌకర్యములు;

(కె) ప్రత్యేకముగా దివ్యాంగ మహిళల కొరకు లైంగిక మరియు పునరుత్పత్తి పరమైన ఆరోగ్య భద్రత.

బీమా పథకములు.

26. సముచిత ప్రభుత్వము అధిసూచన ద్వారా దివ్యాంగతలతో కూడిన తమ ఉద్యోగుల కొరకు బీమా పథకములను చేయవలెను.

పునరావాసము.

27. (1) సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు తమ ఆర్థిక స్తోమత మరియు అభివృద్ధికి అధ్యధీనమై పునరావాస సేవలను ముఖ్యంగా ఆరోగ్య, విద్య మరియు ఉపాధి రంగములలో మరియు కార్యక్రమములను చేపట్టవలెను లేదా చేపట్టునట్లు చేయవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) నిమిత్తము, సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు, ప్రభుత్వేతర వ్యవస్థలకు విత్తీయపరమైన సహాయమును మంజూరు చేయవచ్చును.

(3) సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు, పునరావాస విధివిధానములను రూపొందించునపుడు, దివ్యాంగుల కొరకు పనిచేయుచున్న ప్రభుత్వేతర వ్యవస్థలను సంప్రదించవలెను.

పరిశోధన మరియు అభివృద్ధి.

28. దివ్యాంగుల సాధికారిత కొరకు వ్యక్తిగతముగాను మరియు సంస్థల ద్వారాను, ఆవాస మరియు పునరావాస సమస్యలు మరియు అట్టి ఇతర సమస్యలపై సముచిత ప్రభుత్వము ప్రారంభించవలెను లేదా ప్రారంభింపజేయవలెను.

సంస్కృతి మరియు వినోదము.

29. సాంస్కృతిక జీవితమును కలిగి ఉండుటకు, దివ్యాంగులందరి హక్కులను పురోభివృద్ధిగావించేందుకు మరియు సంరక్షించేందుకును మరియు ఈ క్రింది వాటితో కూడిన వినోద కార్యకలాపములలో ఇతరులతో సమానంగా పాల్గొనేందుకు సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు చర్యలు చేపట్టవలెను,-

(ఎ) దివ్యాంగత కలిగిన కళాకారులు మరియు రచయితలు తమ అభిరుచులు మరియు ప్రతిభలను పురస్కరించుకొని సదుపాయములు, మద్ధతు మరియు ప్రాయోజితములు;

(బి) దివ్యాంగుల చారిత్రక అనుభవములను వ్యాఖ్యానించే సంఘటనలుగల చారిత్రక చిత్ర వస్తు ప్రదర్శనశాల ఏర్పాటు;

(సి) దివ్యాంగులకు కళల ప్రవేశ సౌలభ్యం కలుగజేయుట;

(డి) వినోద కేంద్రములు మరియు ఇతర అసోసియేషనుల కార్యకలాపములను పెంపొందించుట;

(ఇ) బాలభట కార్యకలాపము (స్కౌటింగు), నృత్యం, కళల తరగతులు, బహిరంగ క్యాంపులు మరియు సాహసపరమైన కార్యకలాపములలో పాల్గొనేందుకు సౌకర్యాలు కలుగజేయుట;

(ఎఫ్) దివ్యాంగుల సాంస్కృతిక మరియు కళలయందు పునర్‌రూపకల్పన కోర్సులలో పాల్గొనేందుకు అవకాశము కల్పించుట;

(జి) వినోద కార్యక్రమాలలో దివ్యాంగులు ప్రవేశ సౌలభ్యం పొందేందుకు సౌకర్యములు, సాంకేతిక అభివృద్ధి, సహాయక సాధనములు మరియు పరికరములు సమకూర్చుట; మరియు

(హెచ్) సైగభాష, వ్యాఖ్యానము లేదా ఉప-శీర్షికలతో దూరదర్శన్ కార్యక్రమములకు ప్రవేశ సౌలభ్యం పొందేందుకు వినికిడి సాధనములను సమకూర్చుట.

క్రీడా కార్యకలాపములు.

30. (1) దివ్యాంగులు క్రీడా కార్యకలాపములలో చురుకుగా పాల్గొనేందుకు సముచిత ప్రభుత్వము చర్యలను చేపట్టవలెను.

(2) దివ్యాంగులు క్రీడలలోని హక్కును క్రీడా ప్రాధికార సంస్థలు గుర్తించి, వారు క్రీడలో పాల్గొనుటకు వీలు కలిగించవలెను మరియు క్రీడల కార్యకలాపముల పథకములు మరియు కార్యక్రమముల ద్వారా తమ క్రీడా ప్రావీణ్యతలను పెంపొందించుకొనేందుకు మరియు అభివృద్ధి పర్చుటకు తగిన నిబంధనలను చేయవలెను.

(3) ఉప-పరిచ్ఛేదములు (1) మరియు (2)లలోని నిబంధనలకు భంగము వాటిల్లకుండా, ఈ క్రింది వాటి విషయంలో సముచిత ప్రభుత్వము మరియు క్రీడా ప్రాధికార సంస్థలు చర్యలను చేపట్టవలెను,-

(ఎ) దివ్యాంగులు క్రీడా కార్యకలాపములన్నింటిలో పాల్గొనేందుకు వీలుగా కోర్సులను మరియు కార్యక్రమములను పునర్ నిర్మాణము గావించవలెను;

(బి) దివ్యాంగులు క్రీడా కార్యకలాపములన్నింటిలో మౌలిక సదుపాయములను పునర్‌రూపకల్పనచేసి వారికొరకు మద్ధతు నొసగవలెను;

(సి) దివ్యాంగులందరూ క్రీడా కార్యకలాపములలో పాల్గొనేందుకు సమర్థత, ప్రావీణ్యము, స్తోమత మరియు శక్తి సామర్థ్యములను పెంపొందించుకొనేందుకు సాంకేతికతను అభివృద్ధిచేయుట;

(డి) దివ్యాంగులందరూ క్రీడా కార్యకలాపములలో సమర్థవంతంగా పాల్గొనేటట్లు చూడటానికి క్రీడా కార్యకలాపములన్నింటిలోని బహుళేంద్రియ అవసరములు మరియు లక్షణములను సమకూర్చుట;

(ఇ) దివ్యాంగుల శిక్షణ కొరకు కళాక్రీడల సౌకర్యముల స్థాయిని అభివృద్ధి చేసేందుకు నిధులను కేటాయించుట;

(ఎఫ్) దివ్యాంగులకు దివ్యాంగతా పరమైనట్టి నిర్దిష్టమైన క్రీడా సంఘటనలను పురోభివృద్ధిగావించుట మరియు నిర్వహించుటతోపాటు విజేతలకు బహుమతులు ప్రదానం చేయుట మరియు అట్టి క్రీడా సంఘటనలలో ఇతర క్రీడాకారులకు సౌకర్యములు సమకూర్చుట.

## అధ్యాయము - VI

## బెంచ్‌మార్కు దివ్యాంగుల కొరకు ప్రత్యేక నిబంధనలు

బెంచ్‌మార్కు దివ్యాంగతలు గల బాలలకు ఉచిత విద్య.

31. (1) ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకైన బాలల హక్కు చట్టము, 2009 (2009లోని 35వది)లో ఏమి ఉన్నప్పటికీ, ఆరు నుండి పదునెనిమిది సంవత్సరముల మధ్య వయస్సుగల బెంచ్‌మార్కు దివ్యాంగతతో ఉన్న ప్రతి బాల, బాలిక సమీపములో ఉన్న పాఠశాలలో లేదా అతని ఎంపిక మేరకు ప్రత్యేక పాఠశాలలో ఉచిత విద్యకు హక్కు కలిగి ఉండవలెను.

(2) బెంచ్‌మార్కు దివ్యాంగత గలిగిన ప్రతి బాల, బాలిక పదునెనిమిది సంవత్సరముల వయస్సు వచ్చునంత వరకు సముచితమైన వాతావరణంలో ఉచిత విద్య పొందుటకు సముచిత ప్రభుత్వము మరియు ప్రాధికార సంస్థలు తగు శ్రద్ధ వహించవలెను.

ఉన్నత విద్యా సంస్థలలో రిజర్వేషను.

32. (1) ప్రభుత్వము యొక్క ఉన్నత విద్యా సంస్థలు అన్నియు మరియు ప్రభుత్వము నుండి సహాయముపొందే ఇతర ఉన్నత విద్యా సంస్థలు, ఐదు శాతమునకు తక్కువగాని సీట్లను బెంచ్ మార్క్ దివ్యాంగుల కొరకు రిజర్వుచేయవలెను.

(2) బెంచ్‌మార్కు దివ్యాంగులకు ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశము నిమిత్తము ఐదు సంవత్సరముల అధిక వయస్సు వరకు సడలింపు నొసగవలెను.

రిజర్వేషను నిమిత్తము పదవుల గుర్తింపు.

33. సముచిత ప్రభుత్వము,-

(i) 34వ పరిచ్ఛేదపు నిబంధనల ననుసరించి రిజర్వుచేయబడిన ఖాళీలకు సంబంధించి బెంచ్‌మార్కు దివ్యాంగతలు గలిగినట్టి ఆయా వర్గములకు చెందిన వారి కొరకు, సంస్థలలోని పదవులను గుర్తించవలెను;

(ii) అట్టి పదవులను గుర్తించేందుకు బెంచ్‌మార్కు దివ్యాంగులు ప్రాతినిధ్యము వహించే నిపుణుల కమిటీని ఏర్పాటు చేయవలెను; మరియు

(iii) అట్లు గుర్తించబడిన పదవులను మూడు సంవత్సరములకు మించని అంతరావధులలో నియతకాలికంగా పునర్విలోకనము చేయవలెను.

రిజర్వేషను.

34. (1) ప్రతి ప్రభుత్వ సంస్థ యొక్క కేడరు సిబ్బందియందు మొత్తము ఖాళీల సంఖ్యలో నాలుగు శాతమునకు తగ్గకుండా బెంచ్‌మార్కు దివ్యాంగతలు గలిగిన వ్యక్తులతో భర్తీ చేయబడవలెను. కాగా ప్రతి గ్రూపులోని పదవులతో ఈ క్రింద తెలియజేయబడిన ఖండములు (ఏ), (బి) మరియు (సి)లలోని వారికి ఒక శాతము చొప్పున మరియు ఖండము (డి) మరియు (ఇ)లలోని వారికి ఒక శాతము చొప్పునను రిజర్వు చేయబడునట్లు, సముచిత ప్రభుత్వము నియతము చేయవలెను, అవేవనగా,-

(ఏ) అంధత్వము మరియు చూపు తక్కువ గలవారు;

(బి) చెవిటి మరియు వినికిడి లోపము ఉన్నవారు;

(సి) మస్తిష్క పక్షవాతం (సెరెబ్రల్ పాల్సీ), కుష్టు వ్యాధి నుండి స్వస్థత పొందినవారు, మరుగుజ్జు, యాసిడ్ దాడి బాధితులతో కూడిన దివ్యాంగతలు కలవారు మరియు కండరాల బలహీనత;

(డి) పరిసరములను పట్టించుకొనకుండా తన ఆలోచనలతో లీనమై ఉండు మానసిక వ్యాధి, బుద్ధిహీనత మరియు మానసిక రుగ్మత;

(ఇ) ప్రతి దివ్యాంగతలకు గుర్తించబడిన పదవులలో చెవిటి-అంధత్వముతో సహా ఖండములు (ఏ) నుండి (డి) వరకు గల వాటి క్రింది వ్యక్తులలో నుండి పలు దివ్యాంగతలు గలవారు;

అయితే, పదోన్నతిలోను, రిజర్వేషనులోను ఆయా సమయములందు సముచిత ప్రభుత్వము జారీ చేయునట్టి సంసూచనల ప్రకారము జరుగవలెను:

అంతేకాక, సముచిత ప్రభుత్వము, ముఖ్య కమీషనరు లేదా సందర్భానుసారము రాజ్య కమీషనరుతో సంప్రదించి అధిసూచన ద్వారా ఏదేని ప్రభుత్వ సంస్థలో నిర్వర్తించబడు పని పద్ధతినిబట్టి, సదరు అనుసూచనలలో నిర్దిష్టపరచబడునట్టి షరతులేవైనా ఉన్నట్లయితే వాటికి అధ్యధీనమై, ఈ పరిచ్ఛేదపు నిబంధనల నుండి ఏదేని ప్రభుత్వ సంస్థను మినహాయించవచ్చును.

(2) ఏదేని సిబ్బంది భర్తీ సంవత్సరములో బెంచ్‌మార్కు దివ్యాంగతగల వ్యక్తి లేదా ఏదేని ఇతర తగిన కారణము వలన ఏదేని ఖాళీ భర్తీచేయబడనపుడు, అట్టి ఖాళీని తరువాతి సిబ్బంది భర్తీ సంవత్సరమునకు తీసుకొనివచ్చి పరిశీలించవలెను మరియు ఆ సంవత్సరములో కూడా తగిన అభ్యర్థి లభ్యముగానపుడు పైన పేర్కొనబడిన ఐదు కేటగిరీలలోని వాటితో పరస్పర మార్పు చేసినప్పటికిని ఆ సంవత్సరములో తగిన వ్యక్తి లభించనపుడు, సంస్థ యజమాని ఎట్టి దివ్యాంగతలులేని ఇతర వ్యక్తి ద్వారా మాత్రమే సదరు ఖాళీని భర్తీ చేయవలసి ఉంటుంది:

అయితే, ఒక సంస్థలోని ఖాళీని సదరు కేటగిరీయందలి వ్యక్తిచే భర్తీచేయబడనపుడు, సముచిత ప్రభుత్వము యొక్క పూర్వ ఆమోదముతో ఐదు కేటగిరీలలోని వ్యక్తులను పరస్పర మార్పు ద్వారా మాత్రమే సదరు ఖాళీలను భర్తీ చేయవలసి ఉంటుంది.

(3) సముచిత ప్రభుత్వము అధిసూచన ద్వారా, బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన వ్యక్తుల కొరకైన ఉపాధికి గల ఎగువ వయస్సు, తాను ఉచితమని భావించునట్టి విధముగా సడలించవచ్చును.

35. సముచిత ప్రభుత్వము లేదా స్థానిక ప్రాధికార సంస్థలు తమ ఆర్థిక స్తోమతకు మరియు అభివృద్ధికి అధ్యధీనమై బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన వ్యక్తుల పని ఒత్తిడిని బట్టి ప్రైవేటు రంగంలోని యజమానికి కనీసము ఐదు శాతము ప్రోత్సాహకములను సమకూర్చవలెను. ప్రైవేటు రంగంలోని యజమానులకు ప్రోత్సాహకములు.

36. సముచిత ప్రభుత్వము అధిసూచన ద్వారా, కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రతి సంస్థలో బెంచ్‌మార్కు దివ్యాంగతతో కూడిన వ్యక్తుల ద్వారా భర్తీ చేయబడిన ఖాళీలను మరియు సదరు వ్యక్తులచే భర్తీ చేయబడవలసి యుండునట్టి ఖాళీల సంఖ్యను తెలియజేయు సమాచారము లేదా రిటర్నును సదరు కేంద్ర ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి ప్రత్యేక ఉపాధికల్పన కేంద్రమునకు సమర్పించవలెను మరియు సదరు సంస్థ అట్టి అభ్యర్థనను పాటించవలెను. ప్రత్యేక ఉపాధికల్పన కేంద్రము.

ప్రత్యేక పథకములు మరియు అభివృద్ధి కార్యక్రమములు.

37. సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికార సంస్థలు అధిసూచన ద్వారా, ఈ క్రింది వాటిని సమకూర్చు నిమిత్తము బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన వ్యక్తులకు అనుకూలంగా పథకములను చేయవచ్చును,-

(ఎ) బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన మహిళలకు వ్యవసాయ భూమి మరియు గృహ నిర్మాణ పథకములు మరియు అభివృద్ధి కార్యక్రమములలో సముచితమైన ప్రాధాన్యతనిస్తూ ఐదు శాతం రిజర్వేషను;

(బి) బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన మహిళల పేదరిక నిర్మూలనకు మరియు వివిధ అభివృద్ధిపరమైన పథకములకు ప్రాధాన్యతనిస్తూ ఐదు శాతము రిజర్వేషను;

(సి) గృహ నిర్మాణము, నివాస వసతి, వృత్తిపరమైన వాటిని ఏర్పాటు చేసేందుకు, వ్యాపారము, నిర్వహణము, వినోద కేంద్రములు మరియు ఉత్పత్తి కేంద్రముల కొరకు ఉపయోగించబడునట్టి భూమి విషయములో ఐదు శాతం రిజర్వేషనుతో రాయితీ రేటుపై భూమిని కేటాయించుట.

## అధ్యాయము - VII

## అధిక మద్ధతు అవసరమైన దివ్యాంగుల కొరకు ప్రత్యేక నిబంధనలు

అధిక మద్ధతు అవసరమైన దివ్యాంగుల కొరకు ప్రత్యేక నిబంధనలు.

38. (1) బెంచ్‌మార్కు దివ్యాంగత గలిగిన ఎవరేని వ్యక్తి అధిక మద్ధతు అవసరమున్నదని స్వయంగా భావించినపుడు అతని లేదా ఆమె తరపున ఎవరేని వ్యక్తి లేదా వ్యవస్థ సముచిత ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి ప్రాధికారికి అధిక మద్ధతు కొరకు దరఖాస్తు చేసుకొనవచ్చును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద దరఖాస్తును స్వీకరించిన ప్రాధికారి, కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి సభ్యులతో కూడిన నిర్ధారణ బోర్డుకు, సదరు విషయమును నిర్దేశించవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద తనకు నిర్దేశించబడిన నిర్ధారణ బోర్డు, కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో సదరు దరఖాస్తును నిర్ధారించి అవసరమైన అధిక మద్ధతును మరియు దాని స్వభావమును ధ్రువీకరించే ప్రాధికారికి పంపవలెను.

(4) ఉప-పరిచ్ఛేదము (3) క్రింద రిపోర్టును స్వీకరించిన మీదట సదరు ప్రాధికారి, ఆ రిపోర్టును అనుసరించియు సంబంధిత పథకములకు అధ్యధీనమై ఈ విషయములో సముచిత ప్రభుత్వము యొక్క ఉత్తరువులకు అధ్యధీనమై కోరబడిన మద్ధతును సమకూర్చవలెను.

## అధ్యాయము - VIII

## సముచిత ప్రభుత్వముల యొక్క కర్తవ్యములు మరియు బాధ్యతలు

జాగృతి ప్రచార ఉద్యమములు.

39. (1) సముచిత ప్రభుత్వము ముఖ్య కమీషనరు లేదా సందర్భానుసారము రాజ్య కమీషనరుతో సంప్రదించి, ఈ చట్టము క్రింద దివ్యాంగులకు సమకూర్చబడిన హక్కులు భద్రపరచబడుటకు జాగృతి ప్రచార ఉద్యమములు నిర్వహించుట, ప్రోత్సహించుట మద్ధతు ఇచ్చుట, పెంపొందించుట మరియు అవగాహన కార్యక్రమములను నిర్వహించవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నిర్దిష్టపరచబడిన కార్యక్రమములు మరియు జాగృతి ప్రచార ఉద్యమములు ఈ క్రింది వాటి గురించి దోహదపరచవలెను,-

(ఎ) సమ్మిళిత విలువలు, సహనము, సహానుభూతిని పెంపొందించుట మరియు వైవిధ్యము విషయములో గౌరవమును పెంపొందించుట;

(బి) దివ్యాంగుల నైపుణ్యములను, ప్రతిభలను మరియు సామర్థ్యములను ముందుగా గుర్తించుట మరియు శ్రామిక సిబ్బంది, కార్మిక మార్కెటు మరియు వృత్తిపరమైన రుసుము విషయములో వారి యొక్క తోడ్పాటు;

(సి) కుటుంబ జీవనం, బంధుత్వములు, బాలబాలికల జననము మరియు పోషణకు దివ్యాంగులచే చేయబడిన నిర్ణయముల పట్ల గౌరవముతో వ్యవహరించుట;

(డి) దివ్యాంగత యొక్క మానవ పరిస్థితి మరియు దివ్యాంగుల హక్కులపై పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయము మరియు వృత్తిపరమైన శిక్షణ స్థాయిలో పునశ్చరణ మరియు అవగాహనను సమకూర్చుట.

(ఇ) యజమానులు, పరిపాలకులు మరియు సహ పనివారలలో దివ్యాంగుల దివ్యాంగత షరతులు మరియు హక్కుల విషయములో పునశ్చరణ మరియు అవగాహనను పెంపొందించుట;

(ఎఫ్) విశ్వవిద్యాలయములు, కళాశాలలు మరియు పాఠశాలలోని పాఠ్యాంశములలో దివ్యాంగుల హక్కులను చేర్చునట్లు తగు శ్రద్ధవహించుట.

40. కేంద్ర ప్రభుత్వము, ముఖ్య కమీషనరుతో సంప్రదించి భౌతిక పరిసరములు, రవాణా సాధనములు, సమాచార మరియు వార్తా ప్రసార సాంకేతిక విధానములు, వీటిలో సముచితమైన సాంకేతికతలు మరియు విధానములు మరియు పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ఇతర సౌకర్యములు సమకూర్చబడిన సేవలు చేరియుండునట్లు ప్రవేశ సౌలభ్య ప్రమాణములను నిబంధిస్తూ దివ్యాంగులకు నియమములను రూపొందించవలెను. ప్రవేశ సౌలభ్యము.

41. (1) ఈ క్రింది వాటిని సమకూర్చు నిమిత్తము సముచిత ప్రభుత్వము తగిన చర్యలను చేపట్టవలెను,- రవాణాను సుగమం చేయుట.

(ఎ) బస్‌స్టాపులు, రైల్వేస్టేషనులు మరియు విమానాశ్రయముల వద్ద పార్కింగు స్థలములు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, టిక్కెటు కౌంటర్లు మరియు టిక్కెటు యంత్రముల వద్ద దివ్యాంగులకు సౌకర్యములు;

(బి) సాంకేతికముగా అనువైన మరియు సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన మరియు డిజైన్లలో పెద్ద మార్పులు చేయకుండిన చోట్ల, దివ్యాంగులకు పాత రవాణా విధానములను తిరిగి వినియోగములోనికి తెచ్చుటతో పాటు, డిజైను ప్రమాణములకు అనుగుణముగా అన్ని రవాణా విధానములలో ప్రవేశం కలిగించుట.

(సి) దివ్యాంగులకు అవసరమైన గమనశీలతకు అనువైన రోడ్ల సదుపాయాలు సమకూర్చుట.

(2) ఈ క్రింది వాటిని దివ్యాంగులకు అందుబాటు ధరలలో లభింపజేయడానికి పథకములు, కార్యక్రమములను సముచిత ప్రభుత్వము అభివృద్ధి చేయవలెను,–

(ఎ) ప్రోత్సాహకములు మరియు రాయితీలు;

(బి) వాహనములను పునర్ వినియోగములోనికి తెచ్చుట; మరియు

(సి) వ్యక్తిగత గతిశీలక సహాయము.

సమాచార మరియు వార్తా ప్రసార సాధనములకు సంబంధించిన సాంకేతిక వివరములు.

42. ఈ క్రింది వాటి విషయములో సముచిత ప్రభుత్వము చర్యలను చేపట్టవలెను,–

(i) దృశ్య, ముద్రణ మరియు ఎలక్ట్రానిక్ మాధ్యమములోని అన్ని విషయములు ఆమోదయోగ్యమైన ప్రరూపములో ఉండునట్లు;

(ii) దృశ్య వివరణ, సైగలతో కూడిన భాషలో వ్యాఖ్యానము మరియు సన్నిహితంగా పత్ర ధృవీకరణ సమకూర్చుట ద్వారా ఎలక్ట్రానిక్ మాధ్యమమును దివ్యాంగులకు అందుబాటులోకి తెచ్చుట;

(iii) విశ్వవ్యాప్త డిజైనులో ప్రతి దినము ఉపయోగార్హమైన విధముగా ఉండేటట్లు ఎలక్ట్రానిక్ వస్తువులు మరియు సాధన సామాగ్రిని సమకూర్చుట.

వినియోగ వస్తువులు.

43. విశ్వవ్యాప్తమైన డిజైనులో వినియోగ వస్తువుల తయారీని పెంపొందించి మరియు వాటిని దివ్యాంగులకు పంపిణీ చేయుటకు సముచిత ప్రభుత్వము చర్యలను తీసుకొనవలెను.

ప్రవేశ సౌలభ్య ప్రమాణములను తప్పనిసరిగా పాటించవలసి ఉండుట.

44. (1) 40వ పరిచ్ఛేదము క్రింద కేంద్ర ప్రభుత్వముచే రూపొందించబడిన నియమములను పాటించకుండా తయారుచేసిన భవన నిర్మాణ ప్లానుతో ఎట్టి కట్టడమునకు ఏ సంస్థయు అనుమతించరాదు.

(2) కేంద్ర ప్రభుత్వముచే రూపొందించబడిన నియమములను పాటిస్తేనే తప్ప, భవన నిర్మాణము పూర్తిఅయిన ధ్రువపత్రమును ఏ సంస్థయు జారీ చేయరాదు మరియు అట్టి భవనము నివాసము కొరకు అనుమతించరాదు.

ప్రస్తుతమున్న మౌలిక సదుపాయములు మరియు ఆవరణలకు ప్రవేశ సౌలభ్యం గావించేందుకు మరియు అందు నిమిత్తము చర్య తీసుకొనుటకు కాలపరిమితి.

45. (1) కేంద్ర ప్రభుత్వముచే రూపొందించబడిన నియమములను అనుసరించి, అట్టి నియమములు అధిసూచించిన తేదీ నుండి ఐదు సంవత్సరములకు మించని కాలావధి లోపల ప్రస్తుతమున్న అన్ని పబ్లికు భవనములకు ప్రవేశ సౌలభ్యమును కలిగించవలెను:

అయితే, ఆయా సందర్భముల ఆధారంగా వారివారి సంసిద్ధతకు మరియు ఇతర సంబంధిత పరిమితులపై ఆధారపడి ఈ నిబంధనను అనుసరించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వము రాజ్యములకు సమయమును పెంచవచ్చును.

(2) ఆరోగ్య కేంద్రములు, పౌర ఆసుపత్రులు, పాఠశాలలు, రైల్వే స్టేషనులు మరియు బస్ స్టాపులు వంటి అత్యవసర సేవలను సమకూర్చేందుకు, వారి యొక్క భవనములకు ప్రవేశ సౌలభ్యమును కలిగించడానికి ప్రాధాన్యత చర్య ప్రాతిపదికపై ప్రణాళికను సముచిత ప్రభుత్వము రూపొందించి, ప్రచురింపజేయవలెను.

46. ప్రవేశ సౌలభ్యమును గురించి 40వ పరిచ్ఛేదము క్రింద కేంద్ర ప్రభుత్వముచే రూపొందించబడిన నియమములను అనుసరించి, అట్టి నియమములు అధిసూచించబడిన తేదీ నుండి రెండు సంవత్సరముల కాలావధి లోపల, ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగానికి సంబంధించిన సరఫరాదారులు ప్రవేశ సౌలభ్యమును సమకూర్చవలెను: ప్రవేశ సౌలభ్యం గావించేందుకు సేవల సరఫరాదారులకు కాలపరిమితి.

అయితే, కేంద్ర ప్రభుత్వము ముఖ్య కమీషనరుతో సంప్రదించి, కొన్ని కేటగిరీల సేవలను సదరు నియమములను అనుసరించి సమకూర్చేందుకైన సమయమును పొడిగించవచ్చును.

47. (1) భారత పునరావాస కౌన్సిలు చట్టము, 1992 (1992లోని 34వది) క్రింద ఏర్పాటు చేయబడిన భారత పునరావాస కౌన్సిలు యొక్క ఏదేని కృత్యము మరియు అధికారమునకు భంగము వాటిల్లకుండా, సముచిత ప్రభుత్వము, ఈ చట్టము నిమిత్తము మానవ వనరులను అభివృద్ధి చేయుటకు తగు శ్రద్ధ వహించవలెను,– మానవ వనరుల అభివృద్ధి.

(ఎ) అన్ని కోర్సులలోని దివ్యాంగత హక్కులపై పంచాయతీరాజ్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, పరిపాలకులు, పోలీసు అధికారులు, న్యాయమూర్తులు మరియు న్యాయవాదులకు శిక్షణను తప్పనిసరి చేయుట;

(బి) పాఠశాలల, కళాశాలల మరియు విశ్వవిద్యాలయముల అధ్యాపకులకు, డాక్టర్లకు, నర్సులకు, పారా మెడికల్ సిబ్బంది, సాంఘిక సంక్షేమ అధికారులు, గ్రామీణ అభివృద్ధి అధికారులు ఆశావర్కర్లు, అంగన్‌వాడి వర్కర్లు, ఇంజనీర్లు, శిల్పులు, ఇతర వృత్తులవారు మరియు సాముదాయిక పనివారలకు అన్ని విద్యా కోర్సులలో దివ్యాంగతను పాఠ్యాంశముగా చేర్చుట;

(సి) స్వతంత్ర జీవనములో శిక్షణతో పాటు కార్యక్రమములను రూపొందించుటలో సామర్థ్యమును ప్రారంభించుట కుటుంబాల కొరకు సాముదాయిక బంధుత్వములు, సాముదాయిక సభ్యులు మరియు ఇతర స్టేక్ హోల్డర్లు మరియు సంరక్షణను, మద్ధతును సమకూర్చువారు;

(డి) పరస్పర తోడ్పాటు మరియు గౌరవములపై సాముదాయిక బంధుత్వములు ఏర్పాటు చేసుకొనుటకు దివ్యాంగులకు స్వతంత్రముగా శిక్షణ పొందునట్లు శ్రద్ధవహించుట;

(ఇ) క్రీడలు, ఆటలు, సాహసవంతమైన కార్యకలాపములపై దృష్టిపెట్టి క్రీడా ఉపాధ్యాయుల కొరకు శిక్షణ కార్యక్రమములను నిర్వహించుట;

(ఎఫ్) ఆవశ్యకమగునట్టి ఏదేని ఇతర సామర్థ్యమును పెంపొందించే అభివృద్ధి చర్యలను చేపట్టుట.

(2) దివ్యాంగత అధ్యయనములపై అన్ని విశ్వవిద్యాలయములు బోధనను మరియు పరిశోధనను పెంపొందించేందుకు అధ్యయన కేంద్రములను కూడా ఏర్పాటు గావించవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొనిన దాయిత్వమును నెరవేర్చు నిమిత్తము, సముచిత ప్రభుత్వము, ఈ చట్టము క్రింద వివిధ బాధ్యతలను నెరవేర్చుటకు తగిన సిబ్బందిని చేర్చుకొనుటకు ప్రవేశము, అవగాహనకు పునశ్చరణ మరియు శిక్షణ నిమిత్తము ప్రణాళికలను రూపొందించి, ప్రతి ఐదు సంవత్సరములలో విశ్లేషణ ఆధారిత ఆవశ్యకములను చేపట్టవలెను.

సామాజిక తనిఖీ.

48. సముచిత ప్రభుత్వము, దివ్యాంగుల పైనను మరియు దివ్యాంగుల ఆవశ్యకత అవసరములపై పథకములు మరియు కార్యక్రమములు ప్రతికూల ప్రభావమును చూపకుండునట్లు శ్రద్ధవహిస్తూ, సదరు వ్యక్తులు అన్ని సాధారణ పథకములు మరియు కార్యక్రమములలో పాల్గొనునట్లు శ్రద్ధ వహించి, సదరు అన్ని సాధారణ పథకములు మరియు కార్యక్రమముల యొక్క సామాజిక ఆడిటును నిర్వహించవలెను.

## అధ్యాయము - IX

## దివ్యాంగుల కొరకైన సంస్థల రిజిస్ట్రీకరణ మరియు అట్టి సంస్థలకు అనుదానములు

సమర్థ ప్రాధికార సంస్థ.

49. రాజ్య ప్రభుత్వము, ఈ అధ్యాయపు ప్రయోజనముల నిమిత్తము, తాను ఉచితమని భావించునట్టి ప్రాధికారిని సమర్థ ప్రాధికార సంస్థగా నియమించవలెను.

రిజిస్ట్రీకరణ.

50. ఈ చట్టము క్రింద ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప సమర్థ ప్రాధికార సంస్థచే, ఈ విషయములో జారీ చేయబడిన రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును అనుసరించి తప్ప, ఏ వ్యక్తియు ఏదేని సంస్థను దివ్యాంగుల కొరకు ఏర్పాటు చేయరాదు లేదా నిర్వహించరాదు:

అయితే, మానసిక ఆరోగ్య చట్టము, 1987 (1987లోని 14వది) యొక్క 8వ పరిచ్ఛేదము క్రింద శాసనమాన్యత కలిగిన లైసెన్సును కలిగి ఉన్నట్టి మరియు మానసిక అనారోగ్యంతో ఉన్న వ్యక్తుల సంరక్షణ కొరకైన సంస్థ లేదా తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర చట్టము, ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయబడనవసరము లేదు.

రిజిస్ట్రీకరణ కొరకు దరఖాస్తు మరియు ధ్రువపత్రమును మంజూరు చేయుట.

51. (1) రిజిస్ట్రీకరణ ధ్రువపత్రము ప్రతి దరఖాస్తును, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపములోను మరియు అట్టి రీతిలోను సమర్థ ప్రాధికార సంస్థకు దాఖలు చేసుకొనవలెను.

(2) సమర్థ ప్రాధికార సంస్థ ఉప-పరిచ్ఛేదము (1) క్రింద దరఖాస్తును స్వీకరించిన మీదట, తాను ఉచితమని భావించునట్టి విచారణలు జరిపి, ఈ చట్టము యొక్క మరియు అందు చేయబడిన నియమముల యొక్క ఆవశ్యకతలను దరఖాస్తుదారు పాటించినట్లు సంతృప్తి చెందిన తరువాత, దరఖాస్తును స్వీకరించిన తొంబది దినముల కాలావధి లోపల దరఖాస్తుదారుకు రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును మంజూరు చేయవలెను మరియు ఆ విధముగా సంతృప్తి చెందినయెడల, సమర్థ ప్రాధికార సంస్థ ధ్రువపత్రము మంజూరు కొరకు చేయబడిన దరఖాస్తును ఉత్తరువు ద్వారా తిరస్కరించవలెను:

అయితే, ధ్రువపత్రమును మంజూరు చేయుటను తిరస్కరిస్తూ ఏదేని ఉత్తరువు చేయుటకు ముందు, దరఖాస్తుదారు విన్నవించుకొనుటకు సబబైన అవకాశమును సమర్థ ప్రాధికార సంస్థ ఇవ్వవలెను మరియు ధ్రువ పత్రమును మంజూరు చేయుటకు నిరాకరిస్తూ చేయబడిన ప్రతి ఉత్తరువును వ్రాతపూర్వకముగా దరఖాస్తుదారుకు అందజేయవలెను.

(3) ధ్రువపత్రము కొరకు దరఖాస్తును దాఖలు చేయుటకైన సంస్థ, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి సౌకర్యములన్నింటిని మరియు అట్టి ప్రమాణములను కలిగి ఉన్ననే తప్ప ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ఎట్టి రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును మంజూరు చేయరాదు.

(4) ఉప-పరిచ్ఛేదము (2) క్రింద మంజూరు చేయబడిన రిజిస్ట్రీకరణ ధ్రువపత్రము,-

(ఎ) 52వ పరిచ్ఛేదము క్రింద ఉపసంహరించబడిననే తప్ప, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి కాలావధిపాటు అమలు కలిగి ఉండవలెను;

(బి) ఆయా సమయములందు అట్టి కాలావధి పాటు నవీకరించబడవలెను; మరియు

(సి) రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపములోను మరియు అట్టి షరతులకు అధ్యధీనమై ఉండవలెను.

(5) రిజిస్ట్రీకరణ ధ్రువపత్రము నవీకరణ కొరకైన దరఖాస్తును, సదరు ధ్రువపత్రము యొక్క శాసనమాన్యత ముగియుటకు అరవై దినములకు ముందుగా దాఖలు చేసుకొనవలెను.

(6) రిజిస్ట్రీకరణ ధ్రువపత్రపు నకలు ప్రతిని సంస్థ యొక్క ప్రముఖముగా కనిపించునట్టి చోట ప్రదర్శింపజేయవలెను.

(7) ఉప-పరిచ్ఛేదము (1) లేదా ఉప-పరిచ్ఛేదము (5) క్రింద చేయబడిన ప్రతి దరఖాస్తును, ఈ విషయములో రాజ్య ప్రభుత్వము అధిసూచించబడునట్టి కాలావధి లోపల సమర్థ ప్రాధికారి పరిష్కరించవలెను.

రిజిస్ట్రీకరణ ప్రతిసంహరణ.

52. (1) సమర్థ ప్రాధికార సంస్థ, 51వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద మంజూరు చేయబడిన ధ్రువపత్రమును కలిగి ఉన్న వ్యక్తి, విశ్వసించుటకు కారణము ఉన్నట్లు అభిప్రాయబడిన యెడల తాను ఉచితమని తలచునట్టి విచారణ చేసిన పిదప సదరు ధ్రువపత్రమును ఉత్తరువు ద్వారా ప్రతిసంహరణ చేయవచ్చును,-

(ఎ) ధ్రువపత్రము జారీకి లేదా నవీకరణ కొరకైన ఏదేని దరఖాస్తుకు సంబంధించి, సరిగాలేని లేదా విషయ వివరములను తప్పుడుగా వివరణ చేసినట్లు; లేదా

(బి) ధ్రువపత్రము మంజూరు చేయుట కొరకైన ఏవేని నియమములు లేదా షరతులను ఉల్లంఘించినాడని లేదా ఉల్లంఘింపజేసినాడని విశ్వసించుటకు కారణము ఉన్నట్లు అభిప్రాయబడినయెడల తాను ఉచితమని తలచునట్టి విచారణ చేసిన పిదప సదరు ధ్రువపత్రమును ఉత్తరువు ద్వారా ఉపసంహరించ వచ్చును:

అయితే, రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును ఎందుకు ప్రతిసంహరించరాదో కారణము చూపవలసినదని సదరు ధ్రువపత్రమును కలిగివున్న వ్యక్తికి అవకాశమును ఇచ్చిననేతప్ప, అట్టి ఏ ఉత్తరువును చేయరాదు.

(2) ధ్రువపత్రమును జారీ చేసిన సంస్థ, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అట్టి ప్రతిసంహరణ తేదీ నుండి తన కృత్యములను నిర్వహించుటను విరమించవలెను:

అయితే, ప్రతిసంహరణ ఉత్తరువుపై, 53వ పరిచ్ఛేదము క్రింద అపీలు దాఖలు చేయబడినపుడు,-

(ఎ) అట్టి అపీలు దాఖలు చేసుకొనుట కొరకై విహితపరచబడిన కాలావధి ముగిసిన అవ్యవహితపూర్వము ఎట్టి అపీలు దాఖలు చేయబడనపుడు; లేదా

(బి) అట్టి అపీలు దాఖలు చేయబడి, ప్రతిసంహరణ ఉత్తరువు సమర్థించబడినపుడు, అపీలు ఉత్తరువు తేదీ నుండి–

– అట్టి సంస్థ పనిచేయుటను విరమించవలెను.

(3) సదరు రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును జారీచేసిన సంస్థలో అట్టి ప్రతిసంహరణ తేదీనాడు ఎవరేని వ్యక్తి ఉన్న యెడల అట్టి దివ్యాంగత గల వ్యక్తిని,–

(ఎ) అతని లేదా ఆమె యొక్క తల్లిదండ్రుల, భర్త లేదా భార్యకు లేదా సందర్భానుసారము శాసనపరమైన సంరక్షకుని వద్దకు పంపవలసినదని సమర్థ ప్రాధికార సంస్థ ఉత్తరువు చేయవచ్చును; లేదా

(బి) సమర్థ ప్రాధికార సంస్థచే నిర్దేశించబడునట్టి ఏదేని ఇతర సంస్థకు బదిలీ చేయవలెను.

(4) రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును కలిగివున్న ప్రతి సంస్థ, ఈ పరిచ్ఛేదము క్రింద సదరు ధ్రువపత్రము ప్రతిసంహరించబడినపుడు, సదరు ప్రతిసంహరణ తేదీకి అవ్యవహితపూర్వము, సదరు ధ్రువపత్రమును సమర్థ ప్రాధికార సంస్థకు తిరిగి ఇచ్చివేయవలెను.

అపీలు.

53. (1) సమర్థ ప్రాధికార సంస్థ, రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును మంజూరు చేయుటకు తిరస్కరించినందున లేదా ఉత్తరువు ద్వారా రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును ప్రతిసంహరించినందున, సదరు ఉత్తరువు ద్వారా వ్యధితుడైన ఎవరేని వ్యక్తి, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి కాలావధి లోపల, అట్టి తిరస్కరణ లేదా ప్రతిసంహరణపై, రాజ్య ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి అట్టి అపిలేటు ప్రాధికారికి అపీలును దాఖలు చేసుకొనవచ్చును.

(2) అట్టి అపీలుపై, అపిలేటు ప్రాధికార సంస్థ యొక్క ఉత్తరువు అంతిమమైనదై ఉండవలెను.

కేంద్ర లేదా రాజ్య ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడిన లేదా నిర్వహించబడిన సంస్థలకు ఈ చట్టము వర్తించకుండుట.

54. ఈ అధ్యాయములో ఉన్నదేదియు, కేంద్ర ప్రభుత్వము లేదా రాజ్య ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడిన లేదా నిర్వహించబడినట్టి దివ్యాంగుల సంస్థకు వర్తించరాదు.

రిజిస్టరు చేయబడిన సంస్థలకు సహాయము.

55. సముచిత ప్రభుత్వము తనయొక్క ఆర్థిక స్తోమత మరియు అభివృద్ధికి అధ్యధీనమై, ఈ చట్టము యొక్క నిబంధనలను పురస్కరించుకొని సేవలు సమకూర్చిన మరియు పథకములు మరియు కార్యక్రమములను అమలు జరిగినట్టి రిజిస్టరైన సంస్థలకు విత్తీయ సహాయమును మంజూరు చేయవచ్చును.

## అధ్యాయము - X

## నిర్దిష్టమైన దివ్యాంగతల ధ్రువీకరణ

56. కేంద్ర ప్రభుత్వము, ఒక వ్యక్తిలోని దివ్యాంగత ఏమేరకు ఉన్నదనే విషయమును నిర్ధారించు నిమిత్తము, మార్గదర్శక సూత్రములను అధిసూచించవలెను.

నిర్దిష్టపరచబడిన దివ్యాంగతలను నిర్ధారించుటకు మార్గదర్శక సూత్రములు.

57. (1) సముచిత ప్రభుత్వము, దివ్యాంగత ధ్రువపత్రమును జారీచేయుటకు సమర్థులైన వ్యక్తులను ధ్రువీకృత ప్రాధికారులుగా ఆవశ్యకమైన అర్హతలు మరియు అనుభవమును కలిగిన వారిని అధిసూచించవలెను.

ధ్రువీకరించు ప్రాధికారులకు హోదాకల్పించుట.

(2) సముచిత ప్రభుత్వము, ధ్రువీకృత ప్రాధికార సంస్థ తన కృత్యములను నిర్వర్తించు అధికారిత పరిధిని మరియు దాని యొక్క షరతులు మరియు నిబంధనలను కూడా అధిసూచించవలెను.

58. (1) నిర్దిష్ట దివ్యాంగతతో కూడిన ఎవరేని వ్యక్తి కేంద్ర ప్రభుత్వముచే, విహితపరచబడునట్టి దివ్యాంగత ధ్రువపత్రమును జారీచేయు నిమిత్తము అధికారిత పరిధి కలిగిన ధ్రువీకృత అధికారికి, అట్టి రీతిలో దరఖాస్తు చేసుకొనవచ్చును.

ధ్రువీకరణ ప్రక్రియ.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద దరఖాస్తును స్వీకరించిన మీదట ధ్రువీకరించు ప్రాధికార సంస్థ, 56వ పరిచ్ఛేదము క్రింద అధిసూచించబడిన సంబంధిత మార్గదర్శక సూత్రములను అనుసరించి, సంబంధిత వ్యక్తి యొక్క దివ్యాంగతను నిర్ధారించవలెను. అట్టి నిర్ధారణ తరువాత, సందర్భానుసారము,-

(ఎ) కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపములో అట్టి వ్యక్తికి దివ్యాంగత ధ్రువపత్రమును జారీచేయవలెను;

(బి) ఆయన నిర్దిష్టపరచబడిన దివ్యాంగతను కలిగి ఉండలేదని, సదరు వ్యక్తికి వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద జారీచేయబడిన దివ్యాంగత ధ్రువపత్రము దేశమంతట శాసనమాన్యతను కలిగి ఉండవలెను.

59. (1) ధ్రువీకరించు ప్రాధికార సంస్థ యొక్క నిర్ణయము వలన వ్యధితుడైన ఎవరేని వ్యక్తి, అట్టి నిర్ణయముపై రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి సమయము లోపల మరియు అట్టి రీతిలో, సదరు ప్రయోజనము నిమిత్తము హోదా కల్పించబడునట్టి అపిలేటు ప్రాధికారికి అపీలు చేసుకొనవచ్చును.

ధ్రువీకరించు ప్రాధికార సంస్థ యొక్క నిర్ణయముపై అపీలు.

(2) అపీలును స్వీకరించిన మీదట, అపిలేటు ప్రాధికారి, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో అపీలును పరిష్కరించవలెను.

## అధ్యాయము - XI

## దివ్యాంగతపై కేంద్ర మరియు రాజ్య సలహా బోర్డులు మరియు జిల్లా స్థాయి కమిటీ

దివ్యాంగతపై కేంద్ర సలహా బోర్డు ఏర్పాటు.

60. (1) కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా దివ్యాంగతపై కేంద్ర సలహా బోర్డు అని పిలువబడే ఒక నికాయమును ఈ చట్టము క్రింద తన అధికారములను వినియోగించుటకు మరియు దానికి ఒసగబడిన కృత్యములను నిర్వర్తించుటకు, ఏర్పాటు చేయవలెను.

(2) కేంద్ర సలహా బోర్డు క్రింది వారితో కూడి ఉండవలెను,-

(ఏ) కేంద్ర ప్రభుత్వములో, దివ్యాంగత వ్యవహారముల శాఖకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మంత్రి - ఛైర్‌పర్సన్, పదవిరీత్యా;

(బి) కేంద్ర ప్రభుత్వములోని, దివ్యాంగత వ్యవహారముల శాఖ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న సహాయ మంత్రి - వైస్‌ఛైర్‌పర్సన్, పదవిరీత్యా;

(సి) పార్లమెంటు యొక్క ముగ్గురు సభ్యులు, వీరిలో లోక్‌సభచే ఎన్నుకొనబడు ఇద్దరు సభ్యులు మరియు రాజ్యసభచే ఎన్నుకొనబడు ఒక సభ్యుడు - సభ్యులు, పదవిరీత్యా;

(డి) అన్ని రాజ్యముల మరియు పరిపాలకులు లేదా కేంద్రపాలిత ప్రాంతముల లెఫ్టినెంట్ గవర్నర్ల యొక్క దివ్యాంగత వ్యవహారములకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మంత్రులు - సభ్యులు, పదవిరీత్యా;

(ఇ) భారత ప్రభుత్వ, దివ్యాంగత వ్యవహారముల శాఖలు, సామాజిక న్యాయము మరియు సాధికారిత, పాఠశాల విద్య మరియు అక్షరాస్యత మరియు ఉన్నత విద్య, స్త్రీ మరియు శిశు అభివృద్ధి శాఖ, వ్యయము, సిబ్బంది మరియు శిక్షణ, పరిపాలనాపరమైన సంస్కరణలు మరియు ప్రజల వ్యధలు, ఆరోగ్యము మరియు కుటుంబ సంక్షేమము, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పారిశ్రామిక విధానము మరియు పురోభివృద్ధి, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణము మరియు పట్టణ పేదరికపు నిర్మూలన, శాస్త్ర మరియు సాంకేతికత, వార్తా ప్రసారములు మరియు సమాచార సాంకేతికత, శాసనవ్యవహారములు, ప్రభుత్వరంగ సంస్థలు, యువజన వ్యవహారములు మరియు క్రీడలు, రోడ్డు రవాణా మరియు రహదారులు మరియు పౌర విమానయానము, ఇన్‌ఛార్జ్ మంత్రులు - సభ్యులు, పదవిరీత్యా;

(ఎఫ్) భారత రూపాంతరీకరణ జాతీయ సంస్థ (నీతి) ఆయోగ్ కార్యదర్శి - సభ్యుడు, పదవిరీత్యా;

(జి) భారత పునరావాస కౌన్సిలు, ఛైర్‌పర్సన్ - సభ్యుడు, పదవిరీత్యా;

(హెచ్) పరిసరాలను పట్టించుకోకుండా తన ఆలోచనలలో లీనమై ఉండునట్టి మానసిక వ్యాధి, మస్తిష్క పక్షవాతం, బుద్ధిహీనత మరియు బహువిధ దివ్యాంగతల సంక్షేమ జాతీయ ట్రస్టు, ఛైర్‌పర్సన్ - సభ్యుడు, పదవిరీత్యా;

(ఐ) జాతీయ దివ్యాంగుల విత్తీయ అభివృద్ధి కార్పొరేషను యొక్క ఛైర్‌పర్సన్ మరియు మేనేజింగు డైరెక్టరు - సభ్యుడు, పదవిరీత్యా;

(జె) కృత్రిమ అవయవముల తయారీ కార్పొరేషను ఛైర్మన్ మరియు మేనేజింగు డైరెక్టరు – సభ్యుడు, పదవిరీత్యా;

(కె) రైల్వేబోర్డు, ఛైర్మన్ – సభ్యుడు, పదవిరీత్యా;

(ఎల్) ఉపాధి మరియు శిక్షణ, కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వశాఖ డైరెక్టరు జనరలు – సభ్యుడు, పదవిరీత్యా;

(ఎమ్) విద్యావిషయిక పరిశోధన మరియు శిక్షణ జాతీయ కౌన్సిలు యొక్క డైరెక్టరు – సభ్యుడు, పదవిరీత్యా;

(ఎన్) ఉపాధ్యాయ విద్య జాతీయ కౌన్సిలు యొక్క ఛైర్‌పర్సన్ – సభ్యుడు, పదవిరీత్యా;

(ఓ) విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషన్ యొక్క ఛైర్‌పర్సన్ – సభ్యుడు, పదవిరీత్యా;

(పి) భారత వైద్య కౌన్సిలు యొక్క ఛైర్‌పర్సన్ – సభ్యుడు, పదవిరీత్యా;

(క్యూ) ఈ క్రింది సంస్థల యొక్క డైరెక్టర్లు :–

| | | | |
|---|---|---|---|
| (i) | దృష్టిపరంగా దివ్యాంగుల జాతీయ సంస్థ | -- | డెహ్రాడూన్; |
| (ii) | మానసిక దివ్యాంగుల జాతీయ సంస్థ | -- | సికింద్రాబాద్; |
| (iii) | భౌతిక దివ్యాంగుల పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సంస్థ | -- | కొత్త ఢిల్లీ; |
| (iv) | వినికిడి పరమైన దివ్యాంగుల ఆలియావర్‌జంగ్ జాతీయ సంస్థ | -- | ముంబై; |
| (v) | ఎముకల సంబంధమైన దివ్యాంగుల జాతీయ సంస్థ | -- | కోల్‌కత్తా; |
| (vi) | పునరావాస శిక్షణ మరియు పరిశోధన జాతీయ సంస్థ | -- | కటక్; |
| (vii) | బహువిధ దివ్యాంగతలతో కూడిన వ్యక్తుల సాధికారిత జాతీయ సంస్థ | -- | చెన్నై; |
| (viii) | మానసిక ఆరోగ్య మరియు విజ్ఞానశాస్త్రముల జాతీయ సంస్థ | -- | బెంగుళూరు; |
| (ix) | భారతీయ సైగ భాష పరిశోధన మరియు శిక్షణ కేంద్రం | -- | కొత్త ఢిల్లీ; |

– సభ్యులు, పదవిరీత్యా;

(ఆర్) కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు సభ్యులు, –

(i) దివ్యాంగత మరియు పునరావాసము రంగంలోని నిపుణులు–ఐదు మంది సభ్యులు;

(ii) పది మంది సభ్యులు, వీరిలో సాధ్యమైనంతవరకు, సంబంధిత దివ్యాంగతలు లేదా దివ్యాంగుల వ్యవస్థల నుండి ప్రభుత్వేతర సంస్థలకు ప్రాతినిధ్యం వహించునట్టి దివ్యాంగులు:

అయితే, పది మంది సభ్యులలో కనీసము ఐదు మంది సభ్యులు మహిళలై ఉండవలెను మరియు కనీసము ఒక్కొక్కరు చొప్పున అనుసూచిత కులములు మరియు అనుసూచిత జనజాతులకు సంబంధించిన వారై ఉండవలెను;

(iii) వాణిజ్య మరియు పరిశ్రమల జాతీయ స్థాయి ఛాంబర్సు ప్రతినిధులు ముగ్గురు వరకు;

(ఎస్) దివ్యాంగత విధివిధానముల విషయములను పరిశీలించే భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి – సభ్యకార్యదర్శి, పదవిరీత్యా.

సభ్యుల యొక్క సేవా షరతులు మరియు నిబంధనలు.

61. (1) ఈ చట్టము క్రింద ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, 60వ పరిచ్ఛేదపు ఉప–పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఆర్) క్రింద నామనిర్దేశము చేయబడిన కేంద్ర సలహా బోర్డు యొక్క సభ్యుడు అతని నామనిర్దేశపు తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధిపాటు పదవిని కలిగి ఉండవలెను:

అయితే, అట్టి సభ్యుడు, ఈ పరిచ్ఛేదములో ఏమిఉన్నప్పటికినీ, అతని ఉత్తరదాయి పదవిలో చేరునంతవరకు పదవిలో కొనసాగవలెను.

(2) కేంద్ర ప్రభుత్వము తాను ఉచితమని భావించినపుడు, 60వ పరిచ్ఛేదపు ఉప–పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఆర్) క్రింద నామనిర్దేశము చేయబడిన ఎవరేని సభ్యుడు, అతని పదవీకాలము ముగియుటకు ముందుగా, తన ఆక్షేపణను తెలియజేయుటకు సబబైన అవకాశమును ఇచ్చిన తరువాత, అతనిని పదవి నుండి తొలగించవచ్చును.

(3) 60వ పరిచ్ఛేదపు ఉప–పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఆర్) క్రింద నామనిర్దేశము చేయబడిన సభ్యుడు, కేంద్ర ప్రభుత్వమునకు తన చేతివ్రాత మూలముగా తెలియజేయుట ద్వారా తన పదవికి రాజీనామా చేయవచ్చును, అటు తరువాత సదరు సభ్యుని యొక్క పదవి ఖాళీ అగును.

(4) కేంద్ర సలహా బోర్డులోని ఆకస్మిక ఖాళీని తాజాగా నామనిర్దేశము చేయుట ద్వారా భర్తీ చేయవలెను. ఆ విధముగా భర్తీ చేయబడిన సభ్యుడు తాను ఎవరి స్థానములో భర్తీ చేయబడినాడో ఆ సభ్యుని మిగిలిన కాలావధి పాటు మాత్రమే పదవిని కలిగి ఉండవలెను.

(5) 60వ పరిచ్ఛేదపు ఉప–పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఆర్) యొక్క ఉప–ఖండము (i) లేదా ఉప–ఖండము (iii) క్రింద నామనిర్దేశము చేయబడిన సభ్యుడు తిరిగి నామనిర్దేశము చేయబడుటకు అర్హుడై ఉండవలెను.

(6) 60వ పరిచ్ఛేదపు ఉప–పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఆర్) యొక్క ఉప–ఖండము (i) మరియు ఉప–ఖండము (ii) క్రింద నామ నిర్దేశము చేయబడిన సభ్యుడు, కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి భత్యములను స్వీకరించవలెను.

62. (1) ఈ క్రింది సందర్భములలో ఏ వ్యక్తియు కేంద్ర సలహా బోర్డు సభ్యునిగా ఉండరాదు,– అనర్హతలు.

(ఎ) దివాలాదారుగా ఉన్న లేదా ఎపుడైనను దివాలాదారుగా ఉండిన లేదా అతని అప్పులు కొంతకాలంపాటు నిలిపిఉంచబడిన లేదా అతడు తన ఋణదాతలతో రాజీచేసుకొనినపుడు; లేదా

(బి) అతడు అస్వస్థుడైనపుడు లేదా ఆ విధంగా సమర్థ న్యాయస్థానముచే ప్రఖ్యానించినపుడు; లేదా

(సి) కేంద్ర ప్రభుత్వము యొక్క అభిప్రాయములో నీతిబాహ్యతతో కూడిన అపరాధమునకు దోషస్థాపన చేయబడిన లేదా దోషస్థాపన చేయబడి ఉండిన; లేదా

(డి) ఈ చట్టము క్రింద అపరాధమునకు దోషస్థాపితుడైన లేదా ఎప్పుడైనను దోషస్థాపన చేయబడిన; లేదా

(ఇ) కేంద్ర ప్రభుత్వము యొక్క అభిప్రాయములో, అతను తన పదవిలో కొనసాగుట వలన జనసామాన్యము యొక్క హితములకు భంగకరముగా ఉండగల విధముగా తన పదవిని దుర్వినియోగము చేసినపుడు.

(2) తొలగింపు విషయములో సంబంధిత సభ్యునికి సబబైన అవకాశమును ఇచ్చిననే తప్ప, ఈ పరిచ్ఛేదము క్రింద కేంద్ర ప్రభుత్వము ఎట్టి తొలగింపు ఉత్తరువును చేయరాదు.

(3) 61వ పరిచ్ఛేదపు ఉప–పరిచ్ఛేదము (1) లేదా ఉప–పరిచ్ఛేదము (5)లో ఏమి ఉన్నప్పటికినీ, ఈ పరిచ్ఛేదము క్రింద తొలగించబడిన సభ్యుడు, తిరిగి నామనిర్దేశమునకు అర్హుడుకాదు.

63. 62వ పరిచ్ఛేదములోని ఏవేని అనర్హతలకు కేంద్ర సలహా బోర్డు యొక్క ఎవరేని సభ్యుడు గురి అయినపుడు, అతని పదవి ఖాళీ కావలెను. సభ్యుల పదవులు ఖాళీ అగుట.

64. కేంద్ర సలహా బోర్డు ప్రతి ఆరు మాసములలో కనీసము ఒకసారి సమావేశము కావలెను మరియు అట్టి సమావేశములందు విహితపరచబడునట్టి ప్రక్రియ నియమముల ననుసరించి వ్యవహార నిర్వహణను జరుపవలెను. దివ్యాంగతపై కేంద్ర సలహా బోర్డు యొక్క సమావేశములు.

65. (1) ఈ చట్టపు నిబంధనలకు అధ్యాధీనమై, దివ్యాంగతపై కేంద్ర సలహా బోర్డు, దివ్యాంగత విషయములలో జాతీయ స్థాయి సంప్రదింపులు మరియు సలహా నికాయముగా ఉండవలెను మరియు దివ్యాంగుల సాధికారతకు సమగ్రమైన విధాన నిర్ణయమును నిరంతర పరిణామ సౌకర్యములతో మరియు వారు తమ హక్కులను సంపూర్తిగా అనుభవింపగలిగేటట్లు చేయు నికాయముగా ఉండవలెను. దివ్యాంగతపై కేంద్ర సలహా బోర్డు యొక్క కృత్యములు.

(2) ముఖ్యంగా పైన పేర్కొనబడిన నిబంధనల సాధారణతకు భంగము వాటిల్లకుండా దివ్యాంగతపై కేంద్ర సలహా బోర్డు ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:–

(ఎ) దివ్యాంగతను గురించిన విషయములో విధాన నిర్ణయములు, కార్యక్రమములు, శాసన నిర్మాణము మరియు ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వమునకు మరియు రాజ్య ప్రభుత్వములకు సలహా ఇచ్చుట;

(బి) దివ్యాంగులకు సంబంధించిన సమస్యల గురించి జాతీయ స్థాయి విధాన నిర్ణయమును అభివృద్ధిచేయుట;

(సి) దివ్యాంగులకు సంబంధించిన విషయములను గురించిన ప్రభుత్వ మరియు ఇతర ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర వ్యవస్థల యొక్క అన్ని విభాగాల కార్యకలాపములను పునర్విలోకనము చేసి సమన్వయపరచుట;

(డి) దివ్యాంగుల కొరకు సంబంధిత ప్రాధికారులు మరియు అంతర్జాతీయ వ్యవస్థలతో జాతీయ ప్రణాళికలతో దివ్యాంగులకు పథకములు మరియు ప్రాజెక్టులను సమకూర్చేందుకు చర్యలు చేపట్టుట;

(ఇ) దివ్యాంగుల కొరకు ముఖాముఖి సమాచారముతో, సేవలు మరియు సామాజిక జీవనములో వారి పాత్ర మరియు పర్యావరణమును పెంపొందించుట, ప్రవేశ సౌలభ్యము, సబబైన వసతి సదుపాయములను విచక్షణా రహితముగా సదరు వ్యక్తులకు సమకూర్చుట;

(ఎఫ్) దివ్యాంగులు పూర్తిగా పాల్గొనేందుకు వీలుగా శాసనములు, విధాన నిర్ణయములు మరియు కార్యక్రమ ప్రభావమును పర్యవేక్షణ చేయుట మరియు మూల్యాంకనము చేయుట;

(జి) కేంద్ర ప్రభుత్వముచే ఆయా సమయములందు అప్పగించబడునట్టి ఇతర కృత్యములు.

దివ్యాంగతపై రాజ్య సలహా బోర్డు ఏర్పాటు.

66. (1) ప్రతి రాజ్య ప్రభుత్వము అధిసూచన ద్వారా దివ్యాంగతపై రాజ్య సలహా బోర్డు అని పిలువబడే ఒక నికాయమును ఈ చట్టము క్రింద తన అధికారములను వినియోగించుటకు మరియు దానికి ఒసగబడిన కృత్యములను నిర్వర్తించుటకు ఏర్పాటు చేయవలెను.

(2) రాజ్య సలహా బోర్డు క్రింది వారితో కూడి ఉండవలెను,–

(ఎ) రాజ్య ప్రభుత్వములో, దివ్యాంగత వ్యవహారముల శాఖకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మంత్రి – ఛైర్‌పర్సన్, పదవిరీత్యా;

(బి) రాజ్య ప్రభుత్వములోని, దివ్యాంగత వ్యవహారములకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న సహాయ లేదా ఉప మంత్రి – వైస్‌ఛైర్‌పర్సన్, పదవిరీత్యా;

(సి) రాజ్య ప్రభుత్వ దివ్యాంగత వ్యవహారముల శాఖలకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న కార్యహక్కులు, పాఠశాల విద్య మరియు అక్షరాస్యత మరియు ఉన్నత విద్య, స్త్రీ మరియు శిశు అభివృద్ధి శాఖ, ఆర్థిక సిబ్బంది మరియు శిక్షణ, పరిపాలనాపరమైన సంస్కరణలు మరియు ప్రజల వ్యధలు, ఆరోగ్యము మరియు కుటుంబ సంక్షేమము, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పారిశ్రామిక విధానము మరియు పురోభివృద్ధి, కార్మిక మరియు ఉపాధి, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణము మరియు పట్టణ పేదరికపు నిర్మూలన,

శాస్త్ర మరియు సాంకేతికత, వార్తా ప్రసారములు మరియు సమాచార సాంకేతికత, శాసన వ్యవహారములు, ప్రభుత్వ రంగ సంస్థలు, యువజన వ్యవహారములు మరియు క్రీడలు, రోడ్డు రవాణా మరియు రహదారులు మరియు రాజ్య ప్రభుత్వము అవసరమని భావించునట్టి ఏదేని ఇతర శాఖ కార్యదర్శి – సభ్యులు, పదవిరీత్యా;

(డి) రాష్ట్ర శాసనమండలి నుండి ముగ్గురు సభ్యులు అందులో రాష్ట్ర శాసనసభచే ఎన్నుకోబడిన ఇద్దరు సభ్యులు, శాసన కౌన్సిలు ఏదైనా ఉన్నయెడల దానిచే ఎన్నుకొనబడిన ఒక సభ్యుడు మరియు శాసన కౌన్సిలు ఏదీ లేనపుడు శాసనసభచే ఎన్నుకొనబడిన మొత్తము ముగ్గురు సభ్యులు, పదవిరీత్యా;

(ఇ) రాజ్య ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు సభ్యులు:–

(i) దివ్యాంగత మరియు పునరావాస రంగంలో నిపుణులైన ఐదు మంది సభ్యులు;

(ii) విహితపరచబడునట్టి రీతిలో జిల్లాలకు ప్రాతినిధ్యము వహించుటకుగాను వంతులవారీ పద్ధతిలో రాజ్య ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు ఐదు మంది సభ్యులు:

అయితే, సంబంధిత జిల్లా పరిపాలన సిఫారసుపై తప్ప, ఈ ఉప–పరిచ్ఛేదము క్రింద ఎట్టి నామనిర్దేశము చేయబడరాదు.

(iii) దివ్యాంగుల ప్రభుత్వేతర వ్యవస్థలు లేదా అసోసియేషనులకు ప్రాతినిధ్యము వహించునట్లు సాధ్యమైనంత వరకు దివ్యాంగతలతో కూడిన పది మంది వ్యక్తులు:

అయితే, ఈ ఖండము క్రింద నామనిర్దేశము చేయబడిన పది మంది వ్యక్తులలో కనీసము ఐదు మంది మహిళలు ఉండవలెను మరియు అనుసూచిత కులములు మరియు అనుసూచిత జనజాతులకు చెందినవారు ఒక్కొక్కరు చొప్పున ఉండవలెను.

(iv) రాజ్య వాణిజ్య మండలి మరియు పరిశ్రమ యొక్క ప్రతినిధులు – ముగ్గురికి మించని వ్యక్తులు;

(ఎఫ్) రాజ్య ప్రభుత్వములో దివ్యాంగత వ్యవహారముల శాఖలోని సంయుక్త కార్యదర్శి హోదాకు తక్కువగాని అధికారి.

సభ్యుల యొక్క సేవా షరతులు మరియు నిబంధనలు.

67. (1) ఈ చట్టము క్రింద ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, 66వ పరిచ్ఛేదపు ఉప–పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఇ) క్రింద నామనిర్దేశము చేయబడిన రాజ్య సలహా బోర్డు యొక్క సభ్యుడు అతని నామనిర్దేశపు తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధిపాటు పదవిని కలిగి ఉండవలెను:

అయితే, అట్టి సభ్యుడు, ఈ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికినీ, అతని ఉత్తరదాయి పదవిలో చేరునంతవరకు పదవిలో కొనసాగవలెను.

(2) రాజ్య ప్రభుత్వము తాను ఉచితమని భావించినపుడు, 66వ పరిచ్ఛేదపు ఉప–పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఇ) క్రింద నామనిర్దేశము చేయబడిన ఎవరేని సభ్యుడు, అతని పదవీకాలము ముగియుటకు ముందుగా, తన ఆక్షేపణను తెలియజేయుటకు సబబైన అవకాశమును ఇచ్చిన తరువాత, అతనిని పదవి నుండి తొలగించవచ్చును.

(3) 66వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఇ) క్రింద నామనిర్దేశము చేయబడిన సభ్యుడు, రాజ్య ప్రభుత్వమునకు తన చేతివ్రాత మూలముగా తెలియజేయుట ద్వారా తన పదవికి రాజీనామా చేయవచ్చును. అటు తరువాత సదరు సభ్యుని యొక్క పదవి ఖాళీ అగును.

(4) రాజ్య సలహా బోర్డులోని ఆకస్మిక ఖాళీని తాజాగా నామనిర్దేశము చేయుట ద్వారా భర్తీ చేయవలెను. ఆ విధముగా భర్తీ చేయబడిన సభ్యుడు తాను ఎవరి స్థానములో భర్తీ చేయబడినాడో ఆ సభ్యుని మిగిలిన కాలావధి పాటు మాత్రమే పదవిని కలిగి ఉండవలెను.

(5) 66వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఇ) యొక్క ఉప-ఖండము (i) లేదా ఉప-ఖండము (iii) క్రింద నామనిర్దేశము చేయబడిన సభ్యుడు తిరిగి నామనిర్దేశము చేయబడుటకు అర్హుడై ఉండవలెను.

(6) 66వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఇ) యొక్క ఉప-ఖండము (i) మరియు ఉప-ఖండము (ii) క్రింద నామనిర్దేశము చేయబడిన సభ్యుడు, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి భత్యములను స్వీకరించవలెను.

అనర్హతలు.

68. (1) ఈ క్రింది సందర్భములలో ఏ వ్యక్తియు రాజ్య సలహాబోర్డు సభ్యునిగా ఉండరాదు,-

(ఎ) దివాలాదారుగా ఉన్న లేదా ఎప్పుడైనను దివాలాదారుగా ఉండిన లేదా అతని అప్పులు కొంతకాలంపాటు నిలిపిఉంచబడిన లేదా అతడు తన ఋణదాతలతో రాజీచేసుకొనినపుడు; లేదా

(బి) అతడు అస్వస్థుడైనపుడు మరియు ఆ విధంగా సమర్థ న్యాయస్థానముచే ప్రఖ్యానము చేయబడినపుడు; లేదా

(సి) రాజ్య ప్రభుత్వము యొక్క అభిప్రాయములో నీతిబాహ్యతతో కూడిన అపరాధమునకు దోషస్థాపన చేయబడిన లేదా దోషస్థాపన చేయబడి ఉండిన; లేదా

(డి) ఈ చట్టము క్రింద అపరాధమునకు దోషస్థాపితుడైన లేదా ఎప్పుడైనను దోషస్థాపన చేయబడిన; లేదా

(ఇ) రాజ్య ప్రభుత్వము యొక్క అభిప్రాయములో, అతను తన పదవిలో కొనసాగుట వలన సాధారణ జనబాహుళ్యము యొక్క హితములకు భంగకరముగా ఉండగల విధముగా తన పదవిని దుర్వినియోగము చేసినపుడు.

(2) తొలగింపు విషయములో సంబంధిత సభ్యునికి సబబైన అవకాశమును ఇచ్చిననే తప్ప, ఈ పరిచ్ఛేదము క్రింద రాజ్య ప్రభుత్వము ఎట్టి తొలగింపు ఉత్తరువును చేయరాదు.

(3) 67వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) లేదా ఉప-పరిచ్ఛేదము (5)లో ఏమి ఉన్నప్పటికినీ, ఈ పరిచ్ఛేదము క్రింద తొలగించబడిన సభ్యుడు, తిరిగి నామనిర్దేశమునకు అర్హుడుకాదు.

69. 68వ పరిచ్ఛేదములోని ఏవేని అనర్హతలకు రాజ్య సలహా బోర్డు యొక్క ఎవరేని సభ్యుడు గురి అయినపుడు, అతని పదవి ఖాళీ కావలెను. పదవులు ఖాళీ అగుట.

70. రాజ్య సలహా బోర్డు ప్రతి ఆరు మాసములలో కనీసము ఒకసారి సమావేశము కావలెను మరియు అట్టి సమావేశములందు రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రక్రియ మరియు నియమముల ననుసరించి వ్యవహార నిర్వహణను జరుపవలెను. దివ్యాంగతపై రాజ్య సలహా బోర్డు యొక్క సమావేశములు.

71. (1) ఈ చట్టపు నిబంధనలకు అధ్యధీనమై దివ్యాంగతపై రాజ్య సలహా బోర్డు, దివ్యాంగత విషయములలో రాజ్య స్థాయి సంప్రదింపులు మరియు సలహా నికాయముగా ఉండవలెను మరియు దివ్యాంగుల సాధికారతకు సమగ్రమైన విధాన నిర్ణయమును నిరంతర పరిణామ సౌకర్యములతో మరియు వారు తమ హక్కులను సంపూర్తిగా అనుభవించగలిగేటట్లు చేయు నికాయముగా ఉండవలెను. దివ్యాంగతపై రాజ్య సలహా బోర్డు యొక్క కృత్యములు.

(2) ముఖ్యంగా పైన పేర్కొనబడిన నిబంధనల సాధారణతకు భంగము వాటిల్లకుండా దివ్యాంగతపై రాజ్య సలహా బోర్డు ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) దివ్యాంగతను గురించిన విషయములో విధాన నిర్ణయములు, కార్యక్రమములు, శాసన నిర్మాణము మరియు ప్రాజెక్టులకు సంబంధించి రాజ్య ప్రభుత్వమునకు సలహా ఇచ్చుట;

(బి) దివ్యాంగులకు సంబంధించిన సమస్యల గురించి రాజ్యస్థాయి విధాన నిర్ణయమును అభివృద్ధిచేయుట;

(సి) దివ్యాంగులకు సంబంధించిన విషయములను గురించిన ప్రభుత్వ మరియు ఇతర ప్రభుత్వ మరియు రాజ్యములోని ప్రభుత్వేతర వ్యవస్థల యొక్క అన్ని శాఖల కార్యకలాపములను పునరీక్షించి మరియు సమన్వయపరచుట;

(డి) దివ్యాంగుల కొరకు సంబంధిత ప్రాధికారులు మరియు అంతర్జాతీయ వ్యవస్థలతో రాజ్య ప్రణాళికలలో దివ్యాంగుల కొరకు పథకములు మరియు ప్రాజెక్టులను సమకూర్చేందుకు చర్యలు చేపట్టుట;

(ఇ) దివ్యాంగుల కొరకు ముఖాముఖి సమాచారముతో, సేవలు మరియు సామాజిక జీవనములో వారి పాత్ర మరియు పర్యావరణం పెంపొందించుట, ప్రవేశ సౌలభ్యము, సబబైన వసతి సదుపాయములను విచక్షణ రహితముగా సదరు వ్యక్తులకు సమకూర్చుట;

(ఎఫ్) దివ్యాంగులు పూర్తిగా పాల్గొనేందుకు వీలుగా శాసనములు, విధాన నిర్ణయములు మరియు కార్యక్రమ ప్రభావమును పర్యవేక్షణ చేయుట మరియు మూల్యాంకనము చేయుట;

(జి) రాజ్య ప్రభుత్వముచే ఆయా సమయములందు అప్పగించబడునట్టి ఇతర కృత్యములు.

దివ్యాంగతపై జిల్లా స్థాయి కమిటీ.

72. రాజ్య ప్రభుత్వము, దివ్యాంగతపై దానిచే విహితపరచబడునట్టి కృత్యములను నిర్వర్తించు నిమిత్తము జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేయవలెను.

ఖాళీల వలన ప్రొసీడింగులు శాసనమాన్యత కోల్పోకుండుట.

73. దివ్యాంగతపై కేంద్ర సలహాబోర్డు, దివ్యాంగతపై రాజ్య సలహా బోర్డు లేదా దివ్యాంగతపై జిల్లా స్థాయి కమిటీ యొక్క ఏ చర్యయు లేదా ప్రొసీడింగు వాటిలో ఏదేని ఖాళీ ఉన్నదను లేదా అట్టి బోర్డు లేదా సందర్భానుసారం కమిటీ ఏర్పాటులో ఏదేని క్రమరాహిత్యము ఉన్నదను కారణము మాత్రమున శాసనమాన్యతను కోల్పోరాదు.

## అధ్యాయము - XII

## దివ్యాంగుల కొరకు ముఖ్య కమీషనరు మరియు రాజ్య కమీషనరు

ముఖ్య కమీషనరు మరియు కమీషనర్ల నియామకము.

74. (1) కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా (ఇటు పిమ్మట "ముఖ్య కమీషనరు" అని పేర్కొనబడు) దివ్యాంగుల కొరకు ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము ఒక ముఖ్య కమీషనరును నియమించవలెను.

(2) కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా ముఖ్య కమీషనరుకు సహాయకారిగా ఉండేందుకుగాను ఇద్దరు కమీషనర్లను నియమించవలెను వారిలో ఒకరు దివ్యాంగుడు అయి ఉండవలెను.

(3) పునరావాసమునకు సంబంధించిన విషయములలో ప్రత్యేక పరిజ్ఞానము లేదా ఆచరణ పూర్వకమైన అనుభవము కలిగి ఉన్ననే తప్ప, ఒక వ్యక్తి ముఖ్య కమీషనరుగా లేదా కమీషనరుగా నియమించబడుటకు అర్హుడు కాదు.

(4) ముఖ్య కమీషనరు మరియు కమీషనరుకు (పింఛను, ఉపదానము మరియు పదవీ విరమణ ఇతర ప్రయోజనములతో పాటు) చెల్లించబడు వేతనము మరియు భత్యములు మరియు ఇతర సేవా షరతులు మరియు నిబంధనలు కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టివిగా ఉండవలెను.

(5) ముఖ్య కమీషనరు తన కృత్యములను నిర్వర్తించుటలో ఆయనకు సహాయకారిగా ఉండేందుకు ఆవశ్యకమైన కేటగిరీల అధికారులు ఇతర ఉద్యోగుల స్వభావమును కేంద్ర ప్రభుత్వము నిర్ధారించవలెను మరియు ముఖ్య కమీషనరు ఉచితమని భావించునట్టి అధికారులు మరియు ఇతర ఉద్యోగులను సమకూర్చవలెను.

(6) ముఖ్య కమీషనరుకు సమకూర్చబడిన అధికారులు మరియు ఉద్యోగులు, ముఖ్య కమీషనరు యొక్క సాధారణ పర్యవేక్షణ మరియు నియంత్రణ క్రింద తమ కృత్యములను నిర్వర్తించవలెను.

(7) అధికారులు మరియు ఉద్యోగుల వేతనములు మరియు భత్యములు మరియు ఇతర సేవాషరతులు కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టివిగా ఉండవలెను.

(8) ముఖ్య కమీషనరుకు, కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి మరియు అట్టి రీతిలో వేరువేరు దివ్యాంగతలు కలిగిన ప్రముఖుల నుండి తీసుకొనబడిన పదకొండు మందికి మించని సభ్యులతో కూడిన సలహా కమిటీ సహాయము చేయవలెను.

75. (1) ముఖ్య కమీషనరు,-

ముఖ్య కమీషనరు యొక్క కృత్యములు.

(ఎ) ఈ చట్టమునకు పరస్పర విరుద్ధముగా ఉండునట్టి ఏదేని శాసనపు నిబంధనలు లేదా విధివిధానములు, కార్యక్రమము మరియు ప్రక్రియలను స్వయంగా గాని లేదా ఇతర విధముగా గాని గుర్తించి అవసరమైన దిద్దుబాటు చర్యలను సిఫారసు చేయుట;

(బి) కేంద్ర ప్రభుత్వము, సముచిత ప్రభుత్వముగా ఉన్న విషయములకు సంబంధించి దివ్యాంగుల హక్కులు లేకుండా చేసిన మరియు వారికి లభ్యంగా ఉన్న సంరక్షణ చర్యలను స్వయంగా గాని లేదా ఇతర విధంగా గాని విచారణ జరిపి, దిద్దుబాటు చర్యల నిమిత్తము సముచిత ప్రాధికారులతో సదరు విషయమును చేపట్టుట;

(సి) ఈ చట్టము క్రింద లేదా దాని ద్వారా లేదా దివ్యాంగుల యొక్క హక్కుల పరిరక్షణకు తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనము ద్వారా సమకూర్చబడిన సంరక్షణ చర్యలను పునర్విలోకనము చేసి, వాటిని సమర్థవంతంగా అమలు జరిపేందుకు చర్యలను సిఫారసు చేయుట;

(డి) దివ్యాంగుల వినియోగమునకు అవరోధము కలిగించు కారకములను పునర్విలోకనము చేసి సముచితమైన నివారణ చర్యలను సిఫారసు చేయుట;

(ఇ) దివ్యాంగుల యొక్క హక్కుల ఒప్పందములను మరియు ఇతర అంతర్జాతీయ పత్రములను అధ్యయనము చేసి, వాటిని సమర్థవంతముగా అమలు జరిపేందుకు సిఫారసులు చేయుట;

(ఎఫ్) దివ్యాంగుల హక్కుల రంగంలో పరిశోధనను చేపట్టి పెంపొందించుట;

(జి) దివ్యాంగుల యొక్క హక్కుల విషయములో జాగృతిని మరియు వారికి లభ్యంగా ఉన్న సంరక్షణ చర్యలను పరిరక్షించడం;

(హెచ్) ఈ చట్టపు నిబంధనలను మరియు దివ్యాంగుల కొరకైన పథకములు కార్యక్రమములను పర్యవేక్షణ చేయుట;

(ఐ) దివ్యాంగుల ప్రయోజనము కొరకు కేంద్ర ప్రభుత్వముచే పంపిణీ చేయబడిన నిధుల వినియోగమును పర్యవేక్షణ చేయుట;

(జె) కేంద్ర ప్రభుత్వముచే అప్పగించబడునట్టి ఏవేని ఇతర కృత్యములను నిర్వర్తించుట.

(2) ముఖ్య కమీషనరు ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించునపుడు ఏదేని విషయముపై కమీషనర్లను సంప్రదించవలెను.

ముఖ్య కమీషనరు యొక్క సిఫారసుపై సముచిత ప్రాధికారుల యొక్క చర్య.

76. 75వ పరిచ్ఛేదపు ఖండము [1][ఉప-పరిచ్ఛేదము (1) యొక్క] (బి)ని పురస్కరించుకొని ముఖ్య కమీషనరు ప్రాధికారికి సిఫారసు చేసినపుడెల్లను సదరు ప్రాధికారి, దానిపై అవసరమైన చర్యను తీసుకొనవలెను మరియు సిఫారసు అందిన తేదీ నుండి మూడు మాసముల లోపల తీసుకొనిన చర్యను గురించి ముఖ్య కమీషనరుకు తెలియజేయవలెను:

అయితే, సదరు ప్రాధికారి ముఖ్య కమీషనరు యొక్క సిఫారసును అంగీకరించని యెడల, అందుకు గల కారణములను మూడు మాసముల కాలావధిలోపల ముఖ్య కమీషనరుకు మరియు వ్యధిత వ్యక్తికి కూడా తెలియజేయవలెను.

ముఖ్య కమీషనరు యొక్క అధికారములు.

77. (1) ముఖ్య కమీషనరు, ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించు నిమిత్తము, సివిలు ప్రక్రియాస్మృతి, 1908 (1908లోని 5వది) క్రింద దావాను విచారణచేయునపుడు, ఈ క్రింది విషయములకు సంబంధించి న్యాయస్థానములో నిహితమైనట్లుగా, సివిలు న్యాయస్థానము యొక్క అవే అధికారములను కలిగి ఉండవలెను, అవేవనగా:-

(ఎ) సాక్షిని సమనుచేసి, హాజరు అగునట్లు చేయుట;

(బి) ఏవేని దస్తావేజులను వెల్లడించుట మరియు వాటిని సమర్పించవలసినదని కోరుట;

(సి) ఏదేని న్యాయస్థానము లేదా కార్యాలయము నుండి ఏదేని ప్రభుత్వ రికార్డును లేదా దాని యొక్క నకలును కోరుట;

(డి) అఫిడవిట్లపై సాక్ష్యమును స్వీకరించుట; మరియు

(ఇ) సాక్ష్యాలను లేదా దస్తావేజులను పరీక్షించేందుకు సమనులను జారీ చేయుట.

(2) ముఖ్య కమీషనరు సమక్షమున గల ప్రతి ప్రొసీడింగు, భారత శిక్షాస్మృతి (1860లోని 45వది) యొక్క పరిచ్ఛేదములు 193 మరియు 228ల యొక్క అర్థము లోపల శాసనిక ప్రొసీడింగులుగా ఉండవలెను మరియు ముఖ్య కమీషనరు, క్రిమినలు ప్రక్రియస్మృతి, 1973 (1974లోని 2వది) యొక్క పరిచ్ఛేదము 195 మరియు అధ్యాయము-XXVI ప్రయోజనముల నిమిత్తము సివిలు న్యాయస్థానముగా పరిగణించబడవలెను.

ముఖ్య కమీషనరు యొక్క వార్షిక మరియు ప్రత్యేక నివేదికలు.

78. (1) ముఖ్య కమీషనరు కేంద్ర ప్రభుత్వమునకు వార్షిక నివేదికను సమర్పించవలెను మరియు వార్షిక నివేదికను సమర్పించునంతవరకు అత్యవసరమని లేదా ముఖ్యమైనదని తాను అభిప్రాయపడినపుడు, ఎప్పుడైననూ ప్రత్యేక నివేదికలను సమర్పించవలెను.

(2) ముఖ్య కమీషనరు, తన సిఫారసులపై తీసుకొనిన లేదా తీసుకొనుటకు ప్రతిపాదించిన చర్య యొక్క పత్రముతో మరియు సిఫారసులను ఆమోదించనందుకు ఏవేని కారణములున్న యెడల వాటితోపాటు వార్షిక నివేదిక మరియు ప్రత్యేక నివేదికలను కేంద్ర ప్రభుత్వమునకు సమర్పించవలెను, వాటిని కేంద్ర ప్రభుత్వము పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశపెట్టవలెను.

(3) వార్షిక మరియు ప్రత్యేక నివేదికలను కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపములోను, అట్టి రీతిలోను మరియు అట్టి వివరములతో కూడి ఉండునట్లు తయారు చేయబడవలెను.

---

1. 2018లోని 4వ చట్టము యొక్క 3వ పరిచ్ఛేదము మరియు రెండవ అనుసూచి ద్వారా (5-01-2018 నుండి) చొప్పించబడినది.

రాజ్యములలో రాజ్య కమీషనరు నియామకము.

79. (1) రాజ్య ప్రభుత్వము అధిసూచన ద్వారా (ఇటు తరువాత "రాజ్య కమీషనరు" అని పేర్కొనబడు) దివ్యాంగుల కొరకు ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము రాజ్య కమీషనరును నియమించవలెను.

(2) పునరావాసమునకు సంబంధించిన విషయములలో ప్రత్యేక పరిజ్ఞానము లేదా ఆచరణ పూర్వకమైన అనుభవము కలిగివున్ననే తప్ప, ఒక వ్యక్తి రాజ్య కమీషనరుగా నియమించబడుటకు అర్హుడు కాడు.

(3) రాజ్య కమీషనరుకు (పింఛను, ఉపదానము మరియు ఇతర పదవీ విరమణ ప్రయోజనములతో పాటు) చెల్లించబడు వేతనము మరియు భత్యములు మరియు ఇతర నిబంధనలు మరియు సేవా షరతులు రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టివిగా ఉండవలెను.

(4) రాజ్య కమీషనరు తన కృత్యములను నిర్వర్తించుటలో ఆయనకు సహాయకారిగా ఉండేందుకు ఆవశ్యకమైన కేటగిరీల అధికారులు మరియు ఇతర ఉద్యోగుల స్వభావమును రాజ్య ప్రభుత్వము నిర్ధారించవలెను మరియు రాజ్య కమీషనరుకు ఉచితమని భావించునట్టి అధికారులు మరియు ఇతర ఉద్యోగులను అది సమకూర్చవలెను.

(5) రాజ్య కమీషనరుకు సమకూర్చబడిన అధికారులు మరియు ఉద్యోగులు, రాజ్య కమీషనరు యొక్క సాధారణ పర్యవేక్షణ మరియు నియంత్రణ క్రింద తమ కృత్యములను నిర్వర్తించవలెను.

(6) అధికారులు మరియు ఉద్యోగుల వేతనములు మరియు భత్యములు మరియు ఇతర సేవాషరతులు రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టివిగా ఉండవలెను.

(7) రాజ్య కమీషనరుకు, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి మరియు అట్టి రీతిలో వేరువేరు దివ్యాంగతలు కలిగిన రంగం (క్షేత్రము)లోని ప్రముఖుల నుండి తీసుకొనబడిన ఐదు మందికి మించని సభ్యులతో కూడిన సలహా కమిటీ సహాయము చేయవలెను.

రాజ్య కమీషనరు యొక్క కృత్యములు.

80. రాజ్య కమీషనరు యొక్క కృత్యములు,–

(ఎ) ఈ చట్టమునకు అసంగతముగా ఉండునట్టి ఏదేని శాసనపు నిబంధనలు లేదా విధివిధానములు, కార్యక్రమము మరియు ప్రక్రియలను స్వయంగా గాని లేదా ఇతర విధముగా గాని గుర్తించి అవసరమైన దిద్దుబాటు చర్యలను సిఫారసు చేయుట;

(బి) రాజ్య ప్రభుత్వము, సముచిత ప్రభుత్వముగా ఉన్న విషయములకు సంబంధించి దివ్యాంగుల హక్కులు లేకుండా చేసిన మరియు వారికి లభ్యంగా ఉన్న సంరక్షణ చర్యలను స్వయంగా గాని లేదా ఇతర విధంగా గాని విచారణ జరిపి, దిద్దుబాటు చర్యల నిమిత్తము సముచిత ప్రాధికారులతో సదరు విషయమును చేపట్టుట;

(సి) ఈ చట్టము క్రింద లేదా దాని ద్వారా లేదా దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనము ద్వారా సమకూర్చబడిన సంరక్షణ చర్యలను పునర్విలోకనము చేసి, వాటిని సమర్థవంతంగా అమలు జరిపేందుకు చర్యలను సిఫారసు చేయుట;

(డి) దివ్యాంగుల వినియోగమునకు అవరోధము కలిగించు కారకములను పునర్విలోకనము చేసి, సముచితమైన నివారణ చర్యలను సిఫారసు చేయుట;

(ఇ) దివ్యాంగుల యొక్క హక్కులపై గ్రంథములను మరియు ఇతర అంతర్జాతీయ పత్రములను అధ్యయనము చేసి మరియు పరిశోధనను జరిపి వాటిని సమర్థవంతముగా అమలు జరిపేందుకు సిఫారసులు చేయుట;

(ఎఫ్) దివ్యాంగుల యొక్క హక్కుల విషయములో జాగృతిని మరియు వారికి లభ్యంగా ఉన్న సంరక్షణ చర్యలను పరిరక్షించడం;

(జి) ఈ చట్టపు నిబంధనలను మరియు దివ్యాంగుల కొరకైన పథకములను, కార్యక్రమములను పర్యవేక్షించుట;

(హెచ్) దివ్యాంగుల ప్రయోజనము కొరకు రాజ్య ప్రభుత్వముచే పంపిణీ చేయబడిన నిధుల వినియోగమును పర్యవేక్షించుట; మరియు

(ఐ) రాజ్య ప్రభుత్వముచే అప్పగించబడునట్టి ఏవేని ఇతర కృత్యములను నిర్వర్తించుట.

రాజ్య కమీషనరు యొక్క సిఫారసుపై సముచిత ప్రాధికారుల యొక్క చర్య.

81. 80వ పరిచ్ఛేదపు ఖండము (బి)ని పురస్కరించుకొని రాజ్య కమీషనరు ప్రాధికారికి సిఫారసు చేసినపుడెల్లను సదరు ప్రాధికారి, దానిపై అవసరమైన చర్యను తీసుకొనవలెను మరియు సిఫారసు అందిన తేదీ నుండి మూడు మాసముల లోపల తీసుకొనిన చర్యను గురించి రాజ్య కమీషనరుకు తెలియజేయవలెను:

అయితే, సదరు ప్రాధికారి రాజ్య కమీషనరు యొక్క సిఫారసును అంగీకరించనియెడల, అందుకు గల కారణములను మూడు మాసముల కాలావధిలోపల దివ్యాంగుల రాజ్య కమీషనరుకు మరియు వ్యథిత వ్యక్తికి కూడా తెలియజేయవలెను.

రాజ్య కమీషనరు యొక్క అధికారములు.

82. (1) రాజ్య కమీషనరు, ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించు నిమిత్తము, సివిలు ప్రక్రియాస్మృతి, 1908 (1908లోని 5వది) క్రింద దావాను విచారణ చేయునపుడు, ఈ క్రింది విషయములకు సంబంధించి న్యాయస్థానములో నిహితమైనట్లుగా, సివిలు న్యాయస్థానము యొక్క అవే అధికారములను కలిగి ఉండవలెను, అవేవనగా:–

(ఎ) సాక్షిని సమనుచేసి, హాజరగునట్లు చేయుట;

(బి) ఏవేని దస్తావేజులను వెల్లడించుట మరియు వాటిని సమర్పించవలసినదని కోరుట;

(సి) ఏదేని న్యాయస్థానము లేదా కార్యాలయము నుండి ఏదేని ప్రభుత్వ రికార్డును లేదా దాని యొక్క నకలును కోరుట;

(డి) అఫిడవిట్లపై సాక్ష్యమును స్వీకరించుట; మరియు

(ఇ) సాక్ష్యాలను లేదా దస్తావేజులను పరీక్షించేందుకు సమనులను జారీ చేయుట.

(2) రాజ్య కమీషనరు సమక్షమున గల ప్రతి ప్రొసీడింగు, భారత శిక్షాస్మృతి (1860లోని 45వది)యొక్క పరిచ్ఛేదములు 193 మరియు 228ల యొక్క అర్థము లోపల శాసనిక ప్రొసీడింగులుగా ఉండవలెను మరియు ముఖ్య కమీషనరు, క్రిమినలు ప్రక్రియాస్మృతి, 1973 (1974లోని 2వది)యొక్క పరిచ్ఛేదము 195 మరియు అధ్యాయము-XXVI ప్రయోజనముల నిమిత్తము సివిలు న్యాయస్థానముగా పరిగణించబడవలెను.

83. (1) రాజ్య కమీషనరు రాజ్య ప్రభుత్వమునకు వార్షిక నివేదికను సమర్పించవలెను మరియు వార్షిక నివేదికను సమర్పించునంతవరకు అత్యవసరమని లేదా ముఖ్యమైనదని తాను అభిప్రాయపడినపుడు, ఎప్పుడైననూ ప్రత్యేక నివేదికలను సమర్పించవలెను. రాజ్య కమీషనరు యొక్క వార్షిక మరియు ప్రత్యేక నివేదికలు.

(2) రాజ్య కమీషనరు, తన సిఫారసులపై తీసుకొనిన లేదా తీసుకొనుటకు ప్రతిపాదించిన చర్యయొక్క పత్రముతో మరియు సిఫారసులను ఆమోదించనందుకు ఏవేని కారణములున్నయెడల వాటితోపాటు వార్షిక నివేదిక మరియు ప్రత్యేక నివేదికలను రాజ్య ప్రభుత్వమునకు సమర్పించవలెను, వాటిని రాజ్య ప్రభుత్వము రాజ్య శాసనమండలి యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశపెట్టవలెను.

(3) వార్షిక మరియు ప్రత్యేక నివేదికలను కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపములోను, అట్టి రీతిలోను మరియు అట్టి వివరములతో కూడి ఉండునట్లు తయారు చేయబడవలెను.

## అధ్యాయము - XIII
## ప్రత్యేక న్యాయస్థానము

84. ఈ చట్టము క్రింద అపరాధములను త్వరితగతిన విచారణ జరిపేందుకు ఉన్నత న్యాయస్థానపు ప్రధాన న్యాయమూర్తి యొక్క అంగీకారముతో రాజ్య ప్రభుత్వము అధిసూచన ద్వారా ప్రతి జిల్లాకు ఒక సెషన్స్ న్యాయస్థానమును ప్రత్యేక న్యాయస్థానముగా నిర్దిష్టపరచవచ్చును. ప్రత్యేక న్యాయస్థానము.

85. (1) ప్రతి ప్రత్యేక న్యాయస్థానమునకు, రాజ్య ప్రభుత్వము అధిసూచన ద్వారా, సదరు న్యాయస్థానములో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరుగా కేసులను విచారణ జరిపేందుకు ఒక ప్రభుత్వ ప్రాసిక్యూటరుగా లేదా ఏడు సంవత్సరములకు తక్కువ గాని కాలావధి పాటు అడ్వకేటుగా పనిచేసిన ఒక అడ్వకేటును నిర్దిష్టపరచవచ్చును. ప్రత్యేక ప్రభుత్వ ప్రాసిక్యూటరు.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నియమించబడిన ప్రత్యేక ప్రభుత్వ ప్రాసిక్యూటరు, రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రుసుములు లేదా ప్రతిమూల్యమును స్వీకరించుటకు హక్కు కలిగి ఉండవలెను.

## అధ్యాయము - XIV
## దివ్యాంగుల కొరకు జాతీయ నిధి

86. (1) దివ్యాంగుల కొరకు జాతీయ నిధి అని పిలువబడే ఒక నిధి ఏర్పాటు చేయబడవలెను అందు ఈ క్రింది వాటిని జమచేయవలెను,- దివ్యాంగుల కొరకు జాతీయ నిధి.

(ఎ) 11వ తేదీ ఆగష్టు, 1983 నాటి అధిసూచన నెం. ఎస్.ఓ.573 (ఈ) ద్వారా దివ్యాంగుల కొరకు ఏర్పాటు చేయబడిన నిధి నుండి మరియు ధార్మిక మరియు ధర్మదాయ చట్టము, 1890 (1890లోని 6వది) క్రింద 2006, నవంబరు 21 తేదీగల అధిసూచన నెం.30–03/2004–డిడిII ద్వారా ఏర్పాటు చేయబడిన ట్రస్టు నిధి లభ్యముగా ఉండే అన్ని పైకములు;

(బి) 2000లోని సివిలు అపీలు నెం.4655 మరియు 5218లలో గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థానము యొక్క, 2004 ఏప్రిల్ 16వ తేదీగల తీర్పు ననుసరించి బ్యాంకులు, కార్పొరేషనులు, విత్తీయ సంస్థల ద్వారా చెల్లించబడు అన్ని పైకములు;

(సి) అనుదానము, కానుకలు, దానములు, మాన్యములు, వీలునామా ఆస్తులు లేదా ఇతర బదిలీల ద్వారా స్వీకరించిన అన్ని మొత్తములు;

(డి) సహాయక అనుదానములతో సహా కేంద్ర ప్రభుత్వము నుండి స్వీకరించిన అన్ని పైకములు;

(ఇ) కేంద్ర ప్రభుత్వము ద్వారా నిర్ణయించబడునట్టి ఇతర వనరుల నుండి లభించే అన్ని పైకములు.

(2) దివ్యాంగుల కొరకైన నిధిని విహితపరచబడునట్టి రీతిలో నిర్వహించబడి వినియోగించబడవలెను.

లెక్కలు మరియు ఆడిటు.

87. (1) కేంద్ర ప్రభుత్వము, భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుతో సంప్రదించి విహితపరచబడునట్టి ప్రరూపములో, ఆదాయ మరియు వ్యయపు లెక్కలతో పాటు సక్రమమైన లెక్కలను మరియు ఇతర సంగత రికార్డులను నిర్వహించవలెను మరియు నిధి యొక్క లెక్కల వార్షిక వివరణను తయారుచేయవలెను.

(2) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుచే నిర్దిష్టపరచబడునట్టి అంతరావధులలో నిధి యొక్క లెక్కలను ఆడిటు చేయించవలెను అట్టి ఆడిటుకు సంబంధించి చేసిన ఏదేని వ్యయమును నిధి నుండి భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుకు చెల్లించవలెను.

(3) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు మరియు నిధి యొక్క లెక్కల ఆడిటుకు సంబంధించి, ఆయనచే నియమించబడిన ఎవరేని ఇతర వ్యక్తి, ప్రభుత్వ లెక్కలను ఆడిటుచేయుటకు సంబంధించి సాధారణంగా భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు కలిగివుండే అవే హక్కులు, విశేషాధికారములు మరియు ప్రాధికారమును కలిగివుండవలెను మరియు ముఖ్యంగా లెక్కల పుస్తకములను, సంబంధిత ఓచర్లను మరియు ఇతర దస్తావేజులను మరియు పత్రములను కోరుటకు మరియు నిధి యొక్క ఏవేని కార్యాలయములను తనిఖీ చేయుటకు అధికారమును కూడా కలిగి ఉండవలెను.

(4) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు లేదా ఈ విషయములో ఆయనచే నియమించబడిన ఎవరేని వ్యక్తిచే ధ్రువీకరించబడిన విధముగా నిధి యొక్క లెక్కలను వాటి ఆడిటు నివేదికతో పాటు కేంద్ర ప్రభుత్వము పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశపెట్టవలెను.

## అధ్యాయము - XV

## దివ్యాంగుల కొరకు రాజ్య నిధి

88. (1) రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో, దివ్యాంగుల కొరకు రాజ్య నిధి అని పిలువబడే ఒక నిధిని రాజ్య ప్రభుత్వము ఏర్పాటు చేయవలెను. దివ్యాంగుల కొరకు రాజ్య నిధి.

(2) రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో సదరు నిధిని వినియోగించి, నిర్వహించవలెను.

(3) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుతో సంప్రదించి రాజ్య ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపములో ఆదాయ మరియు వ్యయపు లెక్కలతో పాటు దివ్యాంగుల కొరకైన రాజ్య నిధిని ప్రతి రాజ్య ప్రభుత్వము సక్రమమైన లెక్కలను మరియు సంబంధిత రికార్డులను నిర్వహించవలెను.

(4) దివ్యాంగుల రాజ్య నిధి యొక్క లెక్కలను, భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుచే, నిర్దిష్టపరచబడునట్టి అంతరావధులలో ఆడిటు చేయవలెను అట్టి ఆడిటుకు సంబంధించి ఆయన చేసిన ఏదేని వ్యయమును రాజ్య నిధి నుండి ఆయనకు చెల్లించవలెను.

(5) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు మరియు సదరు రాజ్య నిధి లెక్కలను ఆడిటు చేయుటకు సంబంధించి ఆయనచే నియమించబడిన ఎవరేని వ్యక్తి ప్రభుత్వ లెక్కలను ఆడిటు చేయుటకు సంబంధించి సాధారణంగా భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు కలిగివుండే అవే హక్కులు, విశేషాధికారములు మరియు ప్రాధికారమును కలిగి ఉండును మరియు ముఖ్యంగా సంబంధిత ఖాతా పుస్తకములు, ఓచర్లు మరియు ఇతర దస్తావేజులు, పత్రములు సమర్పించమని డిమాండు చేయు హక్కును మరియు సదరు రాజ్య నిధి కార్యాలయములను తనిఖీచేయు అధికారమును కూడా కలిగి ఉండును.

(6) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు లేదా ఈ విషయములో ఆయనచే నియమించబడిన ఎవరేని ఇతర వ్యక్తి ధ్రువీకరించిన దివ్యాంగుల కొరకైన రాజ్య నిధి యొక్క లెక్కలు ఆడిటు నివేదికతో పాటు రాజ్య శాసనమండలి రెండు సదనములను కలిగి ఉన్నయెడల వాటి ప్రతి సదనము సమక్షమునను లేదా సదరు మండలి ఒకే సదనమును కలిగి ఉన్నయెడల సదరు సదనము సమక్షమున ప్రవేశపెట్టవలెను.

## అధ్యాయము - XVI

## అపరాధములు మరియు శాస్తులు

చట్టపు నిబంధనలు లేదా అందు చేయబడిన నియమములు లేదా వినియమములను ఉల్లంఘించినందుకు శిక్ష.

89. ఈ చట్టపు నిబంధనలు, లేదా అందు చేయబడిన ఏవేని నియమములను ఉల్లంఘించు ఎవరేని వ్యక్తి మొదటిసారి ఉల్లంఘన చేసినపుడు, పదివేల రూపాయల వరకు విస్తరించగల మరియు దరిమిలా జరిగిన ఉల్లంఘనకు ఏబదివేల రూపాయలకు తక్కువకాని అయితే ఐదు లక్షల రూపాయల వరకు విస్తరించగల జరిమానాతో శిక్షించబడదగి ఉండవలెను.

కంపెనీలచే అపరాధములు.

90. (1) ఈ చట్టము క్రింద అపరాధమును ఒక కంపెనీచే చేయబడినపుడు, అపరాధము జరిగినపుడు ఆ కంపెనీ యొక్క వ్యవహార నిర్వహణకు బాధ్యత వహించిన వ్యక్తి మరియు కంపెనీయు సదరు అపరాధమును చేసినట్లు భావించబడవలెను మరియు చర్య తీసుకొనబడి తదనుసారంగా శిక్షించబడవలెను:

అయితే, అట్టి అపరాధము తనకు తెలియకుండా జరిగినదని లేదా అది జరుగకుండా ఉండేందుకు తగిన ముందు జాగ్రత్తనంతయు తాను తీసుకొనినట్లు ఆయన నిరూపించగలిగినట్లయితే, ఈ చట్టము క్రింద సమకూర్చబడిన ఏదేని శిక్షకు అట్టి ఏ వ్యక్తినిగాని ఈ ఉప-పరిచ్ఛేదములో ఉన్నదేదియు గురిచేయదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఉన్నదేదియు, ఈ చట్టము క్రింద అపరాధమును ఒక కంపెనీ చేసియుండి మరియు సదరు కంపెనీ యొక్క ఎవరేని డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేదా ఇతర అధికారి యొక్క ఏదేని నిర్లక్ష్యము కారణంగా లేదా సమ్మతితో లేదా ఉద్దేశపూర్వక అంగీకారముతో జరిగినదని నిరూపించబడిన యెడల, అట్టి డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేదా ఇతర అధికారి ఆ అపరాధమును చేసినట్లు భావించబడి, చర్యలు చేపట్టబడి తదనుసారంగా శిక్షించబడదగి ఉండవలెను.

**విశదీకరణ :** ఈ పరిచ్ఛేదపు ప్రయోజనముల నిమిత్తము,-

(ఎ) "కంపెనీ" అనగా ఏదేని నిగమిత నికాయము అని అర్థము మరియు ఒక ఫర్మ్ లేదా వ్యక్తుల యొక్క ఇతర అసోసియేషను చేరి యుండును; మరియు

(బి) ఒక ఫర్మ్‌కు సంబంధించి "డైరెక్టరు" అనగా ఫర్మ్ యొక్క భాగస్వామి అని అర్థము.

బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన వ్యక్తుల యొక్క ఏవేని ప్రయోజనములను మోసముతో వినియోగించుకొనినందుకు శిక్ష.

91. బెంచ్‌మార్కు దివ్యాంగతలతో కూడిన వ్యక్తుల యొక్క ప్రయోజనములను కపటముతో వినియోగించిన లేదా అందుకు ప్రయత్నము చేసిన ఏ వ్యక్తి అయినను రెండు సంవత్సరముల వరకు విస్తరించగల కారావాసముతో లేదా ఒక లక్షరూపాయల వరకు ఉండగల జరిమానాతో లేదా రెండింటితోను శిక్షించబడదగి ఉండవలెను.

అత్యాచార అపరాధములకు శిక్ష.

92. ఎవరేని వ్యక్తి,-

(ఎ) ప్రజల దృష్టిలో ఏ ప్రదేశములోనైనను దివ్యాంగుడిని ఉద్దేశపూర్వకముగా అవమానపరచే లేదా బెదిరించే ఉద్దేశముతో వ్యవహరించినయెడల;

(బి) దివ్యాంగుడైన ఎవరేని వ్యక్తిని అగౌరవపరచు ఉద్దేశంతో దౌర్జన్యంచేయు లేదా బలప్రయోగంచేయు లేదా దివ్యాంగతతో కూడిన నమ్రత కలిగిన మహిళపట్ల బలాత్కారం చేయు ఉద్దేశముతో వ్యవహరించిన;

(సి) దివ్యాంగతలతో కూడిన వ్యక్తిపై వాస్తవంగా బాధ్యతకలిగిన లేదా నియంత్రణ కలిగిన వ్యక్తి స్వచ్ఛందంగా లేదా ఉద్దేశపూర్వకంగా ఆహారమును లేదా పానీయమును అతనికి లేదా ఆమెకు సరఫరా చేయుటకు నిరాకరించిన;

(డి) దివ్యాంగతతో కూడిన బాలిక లేదా మహిళ యొక్క అభిమతమునకు విరుద్ధముగా వ్యవహరిస్తూ తన పెద్దరికాన్ని ఆమెపై లైగింక దోపిడీకి పాల్పడినయెడల;

(ఇ) దివ్యాంగతలతో కూడిన వ్యక్తి యొక్క ఏదేని అవయవము లేదా స్పర్శ లేదా మద్ధతునిచ్చే ఏదేని సాధనముతో స్వచ్ఛందంగా హాని కలిగించిన, నష్టపరిచిన లేదా జోక్యము చేసుకొనినయెడల;

(ఎఫ్) రిజిష్ట్రీకృత వైద్య వృత్తిదారుని అభిప్రాయముతో లేదా దివ్యాంగతలతో కూడిన మహిళ యొక్క సమ్మతి లేకుండా ఆమె యొక్క సంరక్షకుని యొక్క అంగీకారముతో కూడా ఏదేని ప్రమాదకర పరిస్థితిలో గర్భమును తీసివేయు వైద్య ప్రక్రియను చేయు, లేదా అందుకు దోహదము చేయునట్టి ఏదేని వైద్య ప్రక్రియను నిర్వహించిన, నిర్వర్తించిన లేదా ఆదేశించినయెడల

– ఆరు మాసములకు తక్కువ కానట్టి అయితే ఐదు సంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారావాసముతో మరియు జరిమానాతో శిక్షించబడదగి ఉండవలెను.

93. ఈ చట్టము క్రింద ఏదేని పుస్తకము, ఖాతా లేదా ఇతర దస్తావేజులు లేదా దాని క్రింద ఇవ్వబడిన ఏదేని ఉత్తరువు లేదా చేయబడిన ఆదేశము క్రింద సమర్పించవలసి ఉండు లేదా ఈ చట్టపు నిబంధనల ననుసరించి వేయబడిన ప్రశ్నలకు సమాధానము ఇవ్వవలసి ఉండునట్టి బాధ్యత గలిగిన వ్యక్తి అట్లు చేయుటలో వైఫల్యము చెందినవారెవరైనను ప్రతి అపరాధము విషయములో ఇర్వై ఐదువేల రూపాయల వరకు విస్తరించగల జరిమానాతోను మరియు జరిమానా శిక్ష విధిస్తూ అసలు ఉత్తరువు తేదీ తరువాత కొనసాగుతున్న వైఫల్యము విషయములో లేదా తిరస్కరణ విషయములో ప్రతి దినమునకు ఒక వెయ్యి రూపాయల వరకు విస్తరించగల తదుపరి జరిమానాతో శిక్షించబడదగి ఉండవలెను.

సమాచారమును సమర్పించుటలో వైఫల్యం చెందినందుకు శిక్ష.

94. సముచిత ప్రభుత్వము యొక్క పూర్వ మంజూరు లేదా ఈ విషయములో దాని ద్వారా ప్రాధికారమీయబడిన అధికారిచే ఫిర్యాదు దాఖలు చేయబడిననే తప్ప, ఈ అధ్యాయము క్రింద, సముచిత ప్రభుత్వము యొక్క ఉద్యోగిచే చేయబడినట్లు ఆరోపించబడిన అపరాధమును ఏ న్యాయస్థానము సంజ్ఞేయముగావించరాదు.

సముచిత ప్రభుత్వము యొక్క పూర్వ మంజూరు.

95. ఈ చట్టము క్రింద శిక్షించబడదగు అపరాధము చేయుటను లేదా చేయకపోవుట మరియు ఏదేని ఇతర కేంద్ర లేదా రాజ్య చట్టము క్రింద కూడా అపరాధమైనపుడు తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనములో ఏమి ఉన్నప్పటికినీ, అట్టి అపరాధమునకు నిందితుడు దోషి అయినపుడు, అధిక స్థాయిలోని శిక్షకు, అట్టి చట్టము క్రింద సమకూర్చబడినట్లు శిక్ష విధించబడదగి ఉండవలెను.

ప్రత్యామ్నాయ శిక్షలు.

ఇతర శాసనముల వర్తింపు ప్రతిబంధకము కారాదు.

96. ఈ చట్టము యొక్క నిబంధనలు, ప్రస్తుతము అమలునందున్న ఏదేని ఇతర శాసనములోని నిబంధనలకు అదనముగాను మరియు వాటి యొక్క ప్రభావమును తగ్గించునవిగా ఉండరాదు.

సద్భావముతో తీసుకొనిన చర్యకు రక్షణ.

97. ఏదేని సముచిత ప్రభుత్వము లేదా దాని యొక్క ఎవరేని అధికారి లేదా ముఖ్య కమీషనరు లేదా రాజ్య కమీషనరు యొక్క ఎవరేని అధికారి లేదా ఉద్యోగిపై, ఈ చట్టము లేదా అందు చేయబడిన నియమముల క్రింద సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనిపైగాని ఎట్టి దావా, అభియోగము లేదా ఇతర శాసనిక చర్య ఉండరాదు.

ఇబ్బందులను తొలగించుటకు అధికారము.

98. (1) ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటలో ఏదేని ఇబ్బంది ఏర్పడినపుడు, సదరు ఇబ్బందిని తొలగించు నిమిత్తము అవసరమని లేదా ఉపయుక్తమని భావించునట్టియు మరియు ఈ చట్టపు నిబంధనలకు అసంగతముగాలేనట్టి నిబంధనలను లేదా ఆదేశములను కేంద్ర ప్రభుత్వము, అధికారిక రాజపత్రములో ప్రచురించబడిన ఉత్తరువు ద్వారా చేయవచ్చును:

అయితే ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి రెండు సంవత్సరముల కాలావధి ముగిసిన తరువాత, ఈ పరిచ్ఛేదము క్రింద అట్టి ఏ ఉత్తరువును జారీ చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ప్రతి ఉత్తరువును, అది చేయబడిన తరువాత సాధ్యమైనంత వెంటనే పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశ పెట్టబడవలెను.

అనుసూచిని సవరించుటకు అధికారము.

99. (1) సముచిత ప్రభుత్వముచే, చేయబడిన సిఫారసులపై లేదా ఇతర విధముగా, అట్లు చేయుట అవసరమని లేదా ఉపయుక్తమని కేంద్ర ప్రభుత్వము సంతృప్తి చెందినయెడల, అధిసూచన ద్వారా అనుసూచిని సవరించవచ్చును, ఏదేని అట్టి అధిసూచన జారీ చేయబడిన మీదట, తదనుసారంగా అనుసూచి సవరించబడినట్లు భావించవలెను.

(2) అట్టి ప్రతి అధిసూచన, అది జారీచేయబడిన సాధ్యమైనంత వెనువెంటనే పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున సమర్పించబడవలెను.

నియమములు చేయుటకు కేంద్ర ప్రభుత్వము యొక్క అధికారము.

100. (1) కేంద్ర ప్రభుత్వము, పూర్వ ముద్రణ అనే షరతులకు అధ్యధీనమై, అధిసూచన ద్వారా, ఈ చట్టపు నిబంధనలను అమలుపరచు నిమిత్తము నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు పైన పేర్కొనబడిన అధికారితకు భంగము వాటిల్లకుండా, ఈ క్రింది అన్నీ లేదా ఏవేని కొన్ని విషయముల కొరకు అట్టి నియమములు నిబంధించవచ్చును, అవేవనగా:–

(ఎ) 6వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద, దివ్యాంగతపై పరిశోధన కొరకు కమిటీని ఏర్పాటుచేయు రీతి;

(బి) 21వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద, సమాన అవకాశ విధాన నిర్ణయమును అధిసూచించు రీతి;

(సి) 22వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద, ప్రతి సంస్థ రికార్డులను నిర్వహించు ప్రరూపము మరియు రీతి;

(డి) 23వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద, ఇబ్బందుల నివారణ అధికారిచే ఫిర్యాదుల రిజిస్టరు నిర్వహించబడు రీతి;

(ఇ) 36వ పరిచ్ఛేదము క్రింద, ప్రత్యేక ఉపాధి కల్పన కేంద్రమునకు సంస్థచే సమాచారము మరియు రిటర్నును సమర్పించు రీతి;

(ఎఫ్) 38వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద, నిర్ధారణ బోర్డు సంరచన మరియు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద, నిర్ధారణ బోర్డుచే చేయబడిన నిర్ధారణ రీతి;

(జి) 40వ పరిచ్ఛేదము క్రింద, దివ్యాంగుల కొరకైన నియమముల ప్రవేశసౌలభ్య ప్రమాణములను నిబంధించుట;

(హెచ్) 58వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద, దివ్యాంగత ధ్రువపత్రము జారీ నిమిత్తము దరఖాస్తు చేయు రీతి మరియు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద, దివ్యాంగత ధ్రువపత్రపు ప్రరూపము;

(ఐ) 61వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) క్రింద, కేంద్ర సలహా బోర్డు యొక్క నామనిర్దేశిత సభ్యులకు చెల్లించబడే భత్యములు;

(జె) 64వ పరిచ్ఛేదము క్రింద, కేంద్ర సలహా బోర్డు యొక్క సమావేశములలోని వ్యవహార నిర్వహణకు ప్రక్రియాపరమైన నియమములు;

(కె) 74వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) క్రింద, ముఖ్య కమీషనరు మరియు కమీషనర్ల యొక్క వేతనములు మరియు భత్యములు మరియు ఇతర సేవా షరతులు;

(ఎల్) 74వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (7) క్రింద ముఖ్య కమీషనరు యొక్క అధికారులు మరియు సిబ్బంది యొక్క వేతనములు మరియు భత్యములు మరియు సేవా షరతులు;

(ఎమ్) 74వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (8) క్రింద నిపుణుల సలహా కమిటీ సంరచన మరియు నియామకపు రీతి;

(ఎన్) 78వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ముఖ్య కమీషనరుచే తయారు చేయబడునట్టి వార్షిక నివేదిక యొక్క ప్రరూపము, రీతి మరియు అందలి విషయము;

(ఓ) 86వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద, నిధి యొక్క ప్రరూపము, వినియోగపు రీతి మరియు నిర్వహణ; మరియు

(పి) 87వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద, నిధి యొక్క ఖాతాల తయారీ కొరకు ప్రరూపము.

(3) ఈ చట్టము క్రింద చేయబడిన ప్రతి నియమము అది చేయబడిన వెనువెంటనే పార్లమెంటు అధివేశనములో ఉన్నపుడు దాని ఉభయ సదనముల సమక్షమున మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు ఉంచవలెను. అట్టి కాలావధి, ఒకే అధివేశనములోగాని, వరుసగావచ్చు రెండు లేక అంతకు ఎక్కువ అధివేశనములలోగాని చేరియుండవచ్చును. పైన చెప్పినట్టి అధివేశనమునకు లేదా వరుసగావచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వము ఉభయసదనములు ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు అంగీకరించినచో లేక ఉభయసదనములు ఆ నియమమును చేయరాదని అంగీకరించినచో,

అటు పిమ్మట ఆ నియమము అట్లు మార్పు చేసిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును లేక సందర్భానుసారముగా ఎట్టి ప్రభావమును కలిగిఉండదు అయినప్పటికినీ, అట్టి ఏదేని మార్పు లేక రద్దు అంతకు పూర్వము, ఆ నియమము క్రిందచేసిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

నియమములు చేయుటకు రాజ్య ప్రభుత్వమునకు అధికారము.

101. (1) రాజ్య ప్రభుత్వము, పూర్వ ప్రచురణ షరతుకు అధ్యధీనమై అధిసూచన ద్వారా, ఈ చట్టపు నిబంధనలను నెరవేర్చు నిమిత్తము, ఈ చట్టపు ప్రారంభ తేదీ నుండి ఆరు మాసముల తరువాత కాకుండా, నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకముగా, పైన పేర్కొనబడిన అధికారముల సాధారణతకు భంగము వాటిల్లకుండా, ఈ క్రింది అన్నీ లేదా ఏవేని కొన్ని విషయములకు సంబంధించి అట్టి నియమములు నిబంధించవచ్చును, అవేవనగా:-

(ఎ) 5వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద దివ్యాంగతపై పరిశోధన కొరకు కమిటీని ఏర్పాటు చేయు రీతి;

(బి) 14వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద పరిమిత సంరక్షకుని మద్ధతును సమకూర్చు రీతి;

(సి) 51వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రిజిస్ట్రీకరణ ధ్రువపత్రము నిమిత్తము దరఖాస్తు ప్రరూపము మరియు దానిని దాఖలు చేయు రీతి;

(డి) 51వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద, రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును మంజూరు చేయుటకు సంస్థలచే సమకూర్చబడు సౌకర్యములు మరియు పాటించవలసియుండునట్టి ప్రమాణములు;

(ఇ) 51వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) క్రింద, రిజిస్ట్రీకరణ ధ్రువపత్రపు శాసనమాన్యత, ప్రరూపము మరియు సదరు ధ్రువపత్రమునకు జతపరచబడిన షరతులు;

(ఎఫ్) 51వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (7) క్రింద రిజిస్ట్రీకరణ ధ్రువపత్రపు దరఖాస్తును పరిష్కరించేందుకు కాలావధి;

(జి) 53వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అపీలు చేయబడుటకు కాలావధి;

(హెచ్) 59వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ధ్రువీకరణ ప్రాధికారి యొక్క ఉత్తరువుపై అపీలుచేయు సమయము మరియు రీతి మరియు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద అట్టి అపీలును పరిష్కరించు రీతి;

(ఐ) 67వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) క్రింద రాజ్య సలహా బోర్డు యొక్క నామనిర్దేశిత సభ్యులకు చెల్లించబడు భత్యములు;

(జె) 70వ పరిచ్ఛేదము క్రింద రాజ్య సలహా బోర్డు యొక్క సమావేశములందు వ్యవహార నిర్వహణ ప్రక్రియ నియమములు;

(కె) 72వ పరిచ్ఛేదము క్రింద జిల్లా స్థాయి కమిటీ యొక్క సంరచన మరియు కృత్యములు;

(ఎల్) 79వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద, రాజ్య కమీషనరు యొక్క వేతనములు, భత్యములు మరియు ఇతర సేవా షరతులు;

(ఎమ్) 79వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద, రాజ్య కమీషనరు యొక్క అధికారుల మరియు సిబ్బంది వేతనములు, భత్యములు మరియు ఇతర సేవా షరతులు;

(ఎన్) 79వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (7) క్రింద సలహా కమిటీ సంరచన మరియు నిపుణుల నియామకపు రీతి;

(ఓ) 83వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద రాజ్య కమీషనరుచే తయారు చేయబడి, సమర్పించబడు వార్షిక మరియు ప్రత్యేక నివేదికల ప్రరూపము, రీతి మరియు అందలి విషయములు;

(పి) 85వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రత్యేక ప్రభుత్వ ప్రాసిక్యూటరుకు చెల్లించబడు రుసుము మరియు ప్రతిమూల్యము;

(క్యూ) 88వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద, దివ్యాంగుల కొరకు రాజ్య నిధిని ఏర్పాటుచేయు రీతి మరియు సదరు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద సదరు నిధి యొక్క వినియోగము మరియు నిర్వహణ రీతి;

(ఆర్) 88వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద, దివ్యాంగుల కొరకైన రాజ్య నిధి యొక్క ప్రరూపము మరియు ఖాతాల తయారీ.

(3) ఈ చట్టము క్రింద చేయబడిన ప్రతి నియమమును, అది చేయబడిన, సాధ్యమైనంత వెంటనే రాజ్య శాసనమండలి రెండు సదనములను కలిగి ఉన్నట్లయితే వాటి ప్రతి సదనము సమక్షమున లేదా సదరు రాజ్య శాసనమండలి ఒకే సదనమును కలిగివున్న యెడల ఆ సదనము సమక్షమున ఉంచవలెను.

రద్దు మరియు వ్యావృతులు.

102. (1) దివ్యాంగుల (హక్కుల సమాన అవకాశ పరిరక్షణ మరియు పూర్తిగా పాల్గొను) చట్టము, 1995 (1996లోని 1వది) ఇందు మూలముగా రద్దు చేయబడినది.

(2) సదరు చట్టపు రద్దుతో నిమిత్తము లేకుండా, సదరు చట్టము క్రింద చేయబడిన దేనికైనను లేదా తీసుకొనబడిన ఏ చర్యయైనను, ఈ చట్టపు తదనుగుణమైన నిబంధనల క్రింద చేయబడినట్లు లేదా తీసుకొనబడినట్లు భావించవలెను.

## అనుసూచి

## (2వ పరిచ్ఛేదపు ఖండము (జెడ్‌సి)ని చూడుము)

## నిర్దిష్ట దివ్యాంగత

1. శారీరక దివ్యాంగత,–

ఏ. లోకోమోటార్ అసమర్థత, ఈ క్రింది వాటితో కూడిన (స్వీయ చలనముతో కూడిన వేరు వేరు కార్యకలాపాలను నెరవేర్చుకొనుటలో ఒక వ్యక్తి యొక్క దివ్యాంగత మరియు మస్కులోస్కెలెటల్ లేదా నరముల వ్యవస్థ లేదా రెండింటి నుండి వచ్చే బాధ)–

(ఎ) "కుష్టువ్యాధి నయమైన వ్యక్తి" అనగా కుష్టు వ్యాధి నయమై అయితే ఈ క్రింది బాధను అనుభవించు–

(i) చేతులలో లేదా పాదములలో స్పర్శజ్ఞానము లేకపోవుటతో పాటు కన్ను మరియు కను రెప్పలో అతి స్వల్పమైన పక్షవాతం (పరిసిస్) అయితే వ్యక్తముకాని విరూపము;

(ii) వ్యక్తమగు విరూపము మరియు అతి స్వల్పమైన పక్షవాతం (పరిసిస్) అయితే మామూలు ఆర్థిక కార్యకలాపములలో నిమగ్నమయ్యేందుకు వీలుగా చేతులు, పాదములలో తగినంత చలనము కలిగి ఉండుట;

(iii) అత్యంత భౌతిక విరూపం దానితో పాటు వయస్సు ముదిరినందువలన అతను/ఆమె లాభదాయకమైన ఏదేని వృత్తిలో అర్థము చేసుకొను స్పృహ లేకపోవుట మరియు "కుష్టు వ్యాధి నయమైన" అను పదమును తదనుసారముగా అన్వయించుకొనవలెను.

(బి) "మస్తిష్క పక్షవాతం" అనగా మెదడులోని ఒకటి లేదా అంతకంటే ఎక్కువ నిర్దిష్ట ప్రాంతములు పాడైనందున కలిగే దేహ కదలికలు మరియు కండరముల సమన్వయం లేకపోవుట, సాధారణంగా జననమునకు పూర్వము, జనన సమయములో, జననము జరిగిన వెనువెంటనే ఇది సంభవిస్తుంది.

(సి) "మరుగుజ్జు" అనగా వయోజనులలో 4 అడుగుల 10 అంగుళములు (147 సెం.మీ.) లేదా అంతకంటే తక్కువ ఎత్తు ఉండే వైద్య లేదా జీవ సంబంధమైన స్థితి.

(డి) "కండరములు క్రమముగా బలహీనపడి పాడైపోవుట", అనగా వంశపారంపర్యంగాను, జన్యుపరంగాను సంభవించే కండరములను బలహీనపరచే వ్యాధి, ఆరోగ్య ప్రదమైన కండరములకు అవసరమైన మాంసకృత్తులను తయారు చేసుకొనుటకు అవరోధమును కలుగజేసే పరిస్థితి, ఎముకలకు అంటుకొని ఉండే మాంసపు కండను బలహీనపరచే వ్యాధి తద్వారా కండరములు బలహీనపడి, కండర బిలంలోని జీవకణములు నశించి పోవుట జరుగును.

(ఇ) "యాసిడ్ దాడి బాధితులు" అనగా యాసిడ్ లేదా అదే మాదిరి హరించి వేయునట్టి పదార్థమును విసిరివేయుట ద్వారా అతి ప్రమాదకరమైన శారీరక గాయమును కలిగించినందున వికృతముతో కూడిన వైకల్యమును కలిగిన వ్యక్తి అని అర్థము;

బీ. దృష్టి మాంద్యము–

(ఎ) "అంధత్వము" అనగా అత్యంత దిద్దుబాటు చర్యలను అవలంభించినప్పటికినీ, ఈ క్రింద తెలియజేయబడిన పరిస్థితులలోవున్న వ్యక్తి–

(i) చూపు పూర్తిగా లేకపోవుట, లేదా

(ii) మెరుగైన కన్ను అత్యంత సాధ్యమైన విధంగా సరిచేసినప్పటికినీ 3/60 లేదా 10/200 (స్నెలెన్) కంటే తక్కువ దృష్టి క్షీణత; లేదా

(iii) 10 డిగ్రీల కంటే తక్కువైన కోణముతో ఉండగల దృష్టిరేఖ పరిమితి.

(బి) "చూపు తగ్గుట" అనగా ఈ క్రింద తెలియజేయబడిన ఏవేని పరిస్థితులను కలిగిన వ్యక్తి యొక్క స్థితి, అవేవనగా–

(i) అత్యంత సాధ్యమైన విధంగా సరిచేసిన మెరుగైన కన్ను ఉన్నప్పటికినీ దృష్టి క్షీణించుట 6/18 లేదా 20/60కి తక్కువగా ఉండి 3/60 లేదా 10/200 (స్నెలెన్); లేదా

(ii) 40 డిగ్రీల నుండి 10 డిగ్రీలకు తగ్గిన దృష్టిరేఖ పరిమితి;

సీ. వినికిడి వైకల్యము–

(ఎ) "చెవిటి" అనగా రెండు చెవులలో సంభాషణ ఫ్రీక్వెన్సీలకు తక్కువగా 70 డీబీతో వినికిడి కోల్పోవు స్థితిలో ఉన్న వ్యక్తి;

(బి) "వినికిడిలోపము" అనగా రెండు చెవులలో సంభాషణ ఫ్రీక్వెన్సీలకు తక్కువగా 60డీబీ నుండి 70 డీబీ వరకు వినికిడి కోల్పోయిన వ్యక్తి పరిస్థితి.

డీ. "సంభాషణ మరియు భాష దివ్యాంగత" అనగా ఇంద్రియ లేదా నరముల సంబంధ కారణముల వలన సంభాషణ మరియు భాష యొక్క ఒకటి లేదా అంతకంటే ఎక్కువ భాగములపై ప్రభావము చూపునట్టి లారిన్‌జెక్టోమీ (స్వరపేటికను తొలగించుట) లేదా అఫసియా (వాగ్బంధనం) వంటి పరిస్థితుల వలన ఏర్పడే శాశ్వత దివ్యాంగత అని అర్థము.

2. మేథో సంబంధమైన దివ్యాంగత, మేథో సంబంధమైన కృత్యములు (హేతువాదము, అభ్యసన, సమస్యలను పరిష్కరించుట)లో మరియు దైనందిన, సామాజిక మరియు ఆచరణ పూర్వకమైన నైపుణ్యములు, ఈ క్రింది వాటితో కూడిన, పొందుపరచుటకు అనుకూలమైన నడతలో వివరించదగిన స్థితి–

(ఎ) "నిర్దిష్టమైన అభ్యసన దివ్యాంగత" అనగా భాషా ప్రక్రియ, మాట్లాడిన లేదా వ్రాసిన, తెలుసుకొనుటకు, మాట్లాడుటకు, చదువుట, వ్రాయుట, ఉచ్ఛరించు లేదా అంకెలతో కూడిన గణన చేయుటకు కష్టంగా ఉండే మరియు గోచరించే దివ్యాంగతలు, డిస్‌లెక్సియా (చదివినది అర్థం చేసుకొనలేకపోవడం), డిస్‌గ్రాఫియా (సరిగా రాయలేకపోవడం), డిస్‌కాల్కులియా (అంకగణిత లెక్కలను చేయలేకపోవడం), డిస్‌ప్రాక్సియా (సమన్వయం మరియు కదలికలో ఇబ్బంది) మరియు అభివృద్ధిదాయకమైన ధాతువుల పెరుగుదల కొరవడడం (అఫాసియా) వంటివి కూడా చేరియుండును.

(బి) "ఆటిజమ్ స్పెక్ట్రమ్ అస్తవ్యస్థత" అనగా నరముల అభివృద్ధి జీవన తొలి మూడు సంవత్సరములలో కనిపించే స్థితి, తెలియజేయు, సంబంధాలను అర్థం చేసుకొను మరియు ఇతరులతో గల సంబంధము అర్థము చేసుకొను, ఇతరులతో గల సంబంధము అసాధారణ లేదా ఒకే మాదిరి కర్మకాండలు లేదా నడవడికలు తరచుగా చేరియుండే వాటిని గురించి ఒక వ్యక్తి యొక్క సామర్థ్యంపై ప్రభావం కలిగివుండును.

3. మానసిక ప్రవర్తన,–

"మానసిక అనారోగ్యము" అనగా ఆలోచన, మనోస్థితి, ఇంద్రియజ్ఞానం తెలియజేయుటలో తగినంత అస్తవ్యస్థత లేదా జ్ఞాపక శక్తిని బాగా తగ్గించే నిర్ణయ సామర్థ్యం, నడవడిక, వాస్తవాన్ని గుర్తించగలిగే స్తోమత లేదా సాధారణంగా జీవన విధానంలో అవసరమయ్యే ఆవశ్యకతలను నెరవేర్చుకొనే సామర్థ్యం, అయితే మేథో సంబంధిత మామూలుగా ఉండవలసిన దానికంటే తక్కువగా ఉండి, ఒక వ్యక్తి యొక్క మెదడు అభివృద్ధిచెందడం నిలచిపోయేస్థితి అని చెప్పవచ్చును.

4. ఈ క్రింద తెలియజేయబడిన వాటి వలన కలిగిన దివ్యాంగత–

(ఎ) దీర్ఘకాలికంగా నరములకు సంబంధించిన స్థితి, అనగా–

(i) "బహు విధ (మల్టిపుల్) స్కెలెరోసిస్" అనగా ఉద్రేక జనకమైన నరముల సంబంధ వ్యాధి మరియు వెన్నెముక మరియు మెదడులోని నరముల ఆగ్జాన్స్ చుట్టూ ఉండే మైలిన్‌షీత్ పాడైపోవుట వలన మెదడులోని నరములు మరియు వెన్నెముకలోని నరముల సామర్థ్యముపై ప్రభావముపడి పరస్పర సంకేతములు కొరవడతాయి;

(ii) 'పార్కిన్‌సన్స్ వ్యాధి" అనగా వణుకు ద్వారా ఏర్పడే నరముల వ్యాధి ఇది వృద్ధి చెందుతూ ఉంటుంది. కండరములు బిగిసుకొనిపోయి కదలికలు తగ్గిపోవుట సంభవిస్తుంది మెదడులోని బాసల్‌గాంగ్లియా క్షీణించి మధ్య వయస్కుల మరియు వృద్ధాప్యము వచ్చిన వారిపై ముఖ్యముగా ప్రభావమును చూపుతుంది మరియు న్యూరో ట్రాన్సుమీటర్ డొపమైన్ తగ్గిపోతుంది.

(బి) రక్తము అస్థవ్యస్థమగుట–

(i) "హీమోఫీలియా" అనగా వంశ పారంపర్యంగా వచ్చే వ్యాధి ఇది మహిళల ద్వారా తమ పురుష సంతానమునకు సోకి మగజాతికి మాత్రమే వచ్చే వ్యాధి, దీనివల్ల రక్తము గడ్డకట్టడం సాధారణంగా జరుగుతుంది అందువలన బాల వయస్కులు ప్రాణాంతకమై రక్తస్రావమునకు గురికాగలరు;

(ii) "తలసేమియా" అనగా వంశపారంపర్యంగా సంభవించే అస్థవ్యస్థతల సమూహము అని చెప్పవచ్చును దీనివలన హిమోగ్లోబిన్ పరిమాణం తగ్గిపోవడమో లేదా పూర్తిగా లేకపోవడమో జరుగుతుంది.

(iii) "సిక్లెసెల్ వ్యాధి" అనగా దీర్ఘకాలిక రక్తహీనత, బాధాకరమైన సంఘటనలు మరియు అనేక జటిల స్వభావం గల సంఘీభూత ధాతువులు మరియు ఇంద్రియముల "హిమోలిటిక్" అస్తవ్యస్థముగా వివరించబడిన వ్యాధి అని అర్థము. హిమోగ్లోబిన్ విడుదలకు కారణమైన రక్తములోని ఎర్రకణముల పలుచని పొర విధ్వంసము గావించునదిగా 'హిమోలిటిక్" అను పదమును నిర్దేశించుకొనవలెను.

5. చెవిటి, అంధత్వముతో పాటు బహువిధ దివ్యాంగతలు (పైన నిర్దిష్టపరచబడిన దివ్యాంగతలలో ఒక దానికి మించిన) అనగా ఒక వ్యక్తి వినికిడి మరియు దృష్టిలోపము వలన, అభివృద్ధి దాయకమైన మరియు విద్యా సమస్యలను తెలియజేయుటలో తీవ్రమైన వ్యధను అనుభవించు వ్యక్తి యొక్క మానసిక పరిస్థితి.

6. కేంద్ర ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి ఏదేని ఇతర వర్గము.